నవతెలంగాణ

మెదక్

1

గురువారం | 21 మార్చి 2024 | www.navatelangana.com

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో మంత్రి



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని భేల్ చౌరస్తా వద్ద బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్వ మాల్‌ను రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి మాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఖిజర్ యఫై జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జహీరాబాద్

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సామాజిక ఉద్యమకారులు, మహమ్మద్ ఖిజర్ యఫై జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తూ, నిరుపేదలకు అండగా యఫై నిలుస్తున్నారన్నారు. ఆయన ఉన్నత ఎత్తుకు ఎదిగి మరిన్ని పదవులను పొందాలపి ఆకాక్షించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ సంధ్య, బిఆర్ఎస్ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు విజయ్ రాథోడ్, సయ్యద్ మహేబూబ్ అలి ,అబ్దుల్లా సిద్దిఖీ, మొహమ్మద్ ఫయాజ్ , మొహమ్మద్ రహిమోద్దీన్, ప్రభాకర్ గుంజేటి, లోకేష్ రెడ్డి, మోహమ్మద్ జావిద్ అలీ, మొహమ్మద్ అజీమోద్దీన్, ఖాజా పటేల్, తజోద్దీన్ , మొహమ్మద్ సలాం కుసంగి, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ఆర్థరైటిస్‌కు రోబోతో చికిత్స..

ఇప్పటికే 400 ఆపరేషన్లు పూర్తి



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

కీళ్ల నొప్పులకు, మోకాళ్ళ అరుగుదల జాయింట్ పెయిన్స్ ఆర్థరైటిస్ వ్యాధు లకు సంబంధించి రోబోతో ఆపరేషన్ తో పాటు ఫిజియోథెరపీ చికిత్స కూడా అందించడం జరుగుతుం దని యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడ ుతూ చాలామంది ఆర్థరైటి సమస్యతో బాధపడుతూ ఆపరేషన్ అంటే భయానికి గురవుతున్నారని రోబోటిక్ ఆపరేషన్ ద్వారా ఎటువంటి భయం లేకుండా పూర్తి చికిత్స అందించవచ్చని ఆయన తెలిపారు. ఆర్థరైటిస్ సమస్య రాగానే ఆపరేషన్ అవసరం ఉండకపోవచ్చు అని కొన్నిరకాల ఫిజియోథెరపీ ఎక్సర్సైజుల ద్వారా నయం చేసుకోవచ్చని అన్నారు. విపరీతమైన కీళ్ల నొప్పులు ఉం టే ఆపరేషన్ తప్పదని అటువంటి వారికి రోబోటిక్ ద్వారా ఫిజియోథెరపీతో పాటు ఎటువంటి ఇబ్బందులు లేని ఆపరేషన్ కూడా చేయడం జరుగుతుందని తెలి పా రు. ఆపరేషన్ జరిగిన పేషంట్ నాలుగు గంటల సమయం తర్వాత నడక ప్రారంభించవచ్చన్నారు. హైదరాబాద్ యశోద హాస్పిటల్ చికిత్స అందిం చడంతోపాటు ప్రతి నెల మూడవ మంగళవారం కరీంనగర్‌లో కూడా అందుబాటులో ఉంటామన్నారు. త్వరలో ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడుతున్నామని పేద మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రోబోటిక్ ఆపరేషన్ ద్వారా చికిత్స పొందిన వారు కూడా సమావేశంలో పాల్గొని తన అనుభవాలను పంచుకున్నారు. సమావేశంలో యశోద ఆసుపత్రి సిబ్బందితోపాటు చికిత్స పొందిన వారు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ తర్వాత పూర్తి ఉపశమనంగా ఉంది...

- వీరాంజనేయులు, జగిత్యాల

నేను విపరీతమైన కీళ్ల నొప్పులతో బాధపడుతూ ఉండేవాడిని. కీళ్ల నొప్పుల వలన వ్యాపారంలో ఇబ్బంది ఉండేది. వ్యాపారం కూడా నష్టాల్లోకి వెళ్ళింది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితులలో యశోద హాస్పిటల్ గురించి తెలిసింది. ఇక్కడ ఆపరేషన్ జరిగిన తర్వాత నా సమస్య పూర్తిగా పరిష్కారం కావడంతో ఇప్పుడు యధావిధిగా అన్ని పనులు చేసుకోగలుగుతున్నాను. వ్యాపారం కూడా సాఫీగా సాగుతోంది..

కీళ్ల మార్పిడితో నడవగలుగుతున్నాను

- రాజమణి, సిద్దిపేట

నాకు కీళ్లు పూర్తిగా అరిగిపోయి అడుగు తీసి అడుగు వేయడానికే ఇబ్బందికర పరిస్థితి ఉండేది. ఎన్నో రకాల మందులు నూనెలు వాడినా ఫలితం లేదు. యశోద హాస్పిటల్‌లో డాక్టర్ సునీల్ కుమార్ ను కలిసిన తర్వాత ఆయన చేసిన ఆపరేషన్ వలన నాకు ప్రస్తుతానికి కీళ్ల నొప్పులు పూర్తిగా తగ్గిపోయాయి. ఇంత పెద్ద వయసులో కూడా నేను ఎవరి, ఎటువంటి సహాయం లేకుండా నడవగలుగుతున్నాను. రోబోటిక్ ద్వారా ఫిజియోథెరపీ చేయడం వలన నొప్పి కూడా అనిపించలేదు.

పార్లమెంట్ ఫైట్



- మెదక్ అభ్యర్థుల ఖరారు కాకపోయినా...
- వంటేరు ప్రతాపరెడ్డి, నీలం మధు, రఘునందన్ మధ్యే పోటీ
- నియోజకవర్గం చుట్టేస్తున్న జహీరాబాద్ అభ్యర్థులు
- సురేష్ షెట్కర్, గాలి అనిల్‌కుమార్, బీబీ పాటిల్ రెండు చోట్లా త్రిముఖ పోటీ.. వ్యూహ ప్రతివ్యూహాల్లో పార్టీలు
- 53 రోజుల ప్రచార సమయంతో ధన ప్రవాహానికి ఛాన్స్

పార్లమెంట్ బిగ్ ఫైట్‌లో ఎవరు పై చేయి సాధిస్తారో..? ఎవరు ఢీలా పడతారో..? తేలాలంటే 53 రోజులు ఆగాల్సిందే. మెదక్ నుంచి పోటీకి దించే అభ్యర్థుల ఖరారు విషయంలో మూడు పార్టీలు కూడా తీవ్రమైన కసరత్తు చేస్తున్నాయి. గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్, కాంగ్రె స్‌లు గెలుపు గుర్రాల్ని బరిలో దించే యోచనలో ఉన్నాయి. బీజేపీ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించింది. జహీరాబాద్ నుంచి మూడు పార్టీల అభ్యర్థులు ఖరారవ్వడంతో ముగ్గురు కూడా నియోజకవర్గం చుట్టేస్తున్నారు. అభ్యర్థులుగా పరిచమవుతూ అసంతృప్తుల్ని కలుస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. రెండు నియోజకవర్గాల్లోనూ త్రిముఖ పోటీ జరగనుండడంతో గెలుపు కోసం మూడు పార్టీలు కూడా వ్యూహ ప్రతివ్యూహాల్లో తలమునకలవుతున్నాయి.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోకజవర్గాల్లో గెలిచి తీరాలన్న పట్టుదలతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు వ్యూహాలు పన్నుతున్నాయి. అభ్యర్థుల ఖరారులోనే సానుకూల వాతారణాన్ని సృష్టించాలని చూస్తున్నాయి. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి మూడు పార్టీలు కూడా బీసీ అభ్యర్థుల్ని బరిలోకి దించాయి. ముగ్గురు కూడా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవజ్ఞులే కావడం విశేషం. మెదక్ నుంచి పోటీ చేయనున్న అభ్యర్థి పాత కాపే అయినప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు మాత్రం తొలిసారిగా పార్లమెంట్‌కు పోటీ చేయనున్నారు. అధికారికంగా ప్రకటించకపోయినా బీఆర్ఎస్ నుంచి వంటేరు ప్రతాపరెడ్డి, కాంగ్రెస్ నుంచి నీలం మధు పేర్లే ఖరారు కానున్నాయి.

నియోజకవర్గం చుట్టేస్తున్న అభ్యర్థులు..

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్ని ఖరారు చేయడంతో నియోజకవర్గమంతటా పర్యటిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ సురేష్ షెట్కర్, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌ ఇద్దరు పాత ప్రత్యర్థులే కావడం గమనార్హం. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గత ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీ చేసిన అనుభవముంది. ముగ్గురు అభ్యర్థులు కూడా జహీరాబాద్ నియోకవర్గం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. పార్టీ నాయకులు, ముఖ్యుల్ని కలుస్తూ ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇతర పార్టీలో ఉన్న అసమ్మతి నాయకుల్ని కలిసి మద్దతు కోరుతు న్నారు. బీఆర్ఎస్‌కు చెందిన అసమ్మతిని తమ వైపు తిప్పుకునేలా బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ప్రయత్నిస్తున్నారు. పాత పరిచయాలను కలుస్తూ మద్దతివ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. సురేష్ షెట్కర్ సైతం పార్టీ నాయకత్వంతో పాటు తన సామాజిక వర్గంలోని పెద్దల్ని కూడా కలుస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని జహీరాబాద్, కామారెడ్డి, బాన్సువాడపై కేంద్రీకరించి తిరుగుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ జహీరాబాద్ పార్లమెంట్ నియోకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు. బీఆర్ఎస్ నాయకత్వాన్ని కలుస్తున్నారు. తన సామాజిక వర్గం మద్దతు కూడా గట్టేలా ప్రయత్నిస్తున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తనకు అనుకూలంగా మారుతుందని బావిస్తున్నారు.

అభ్యర్థుల ప్రకటనే ఆలస్యం..

మెదక్ పార్లమెంట్ నియోకజవర్గం రాష్ట్రంలోనే ప్రత్యేకతను సంతరించుకుంది. వరుసగా ఐదారు ఎన్నికల్లో గులాబీ పార్టీయే గెలుస్తూ వస్తుంది. కేసీఆర్ అనేక సార్లు ఎంపీగా గెలిచారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి రెండు సార్లు గెలిచారు. అంతకు ముందు విజయశాంతి, నరేంద్ర కూడా ఎంపీలుగా గెలిచారు. ఈ సారి కూడా గెలిచి తీరాలన్న పట్టుదలతో కేసీఆర్ అభ్యర్థిని ఖరారు చేయాలని చూస్తున్నారు. వంటేరు ప్రతాపరెడ్డి పేరే ఖరారు అయ్యే అవకాశముంది. అధికారికంగా ప్రకటించకపోవడంతో ఆయన ఏడు నియోజకవర్గాల్లో పర్యటించలేకపోతున్నారు. లోలోపలా వివిధ వర్గాల మద్దతు కూడ గట్టేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఫోన్లు చేసి మద్దతు కోరుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థి ఖరారులో అనేక కోణాల్లో ఆలోచిస్తుంది. బీసీ అభ్యర్థిని పోటీ చేయించాలని చూస్తుంది. పటాన్‌చెరుకు చెందిన నీలం మధుకు ఎంపీ టికెట్ ఇచ్చే అవకాశముంది. మరో పక్క మైనంపల్లి హనుమంతారావు కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఆయన మెదక్ జిల్లా వాసి కావడమే కాకుండా ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయన కొడుకు మెదక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. దీంతో పార్టీలో ఏకాభిప్రాయం వచ్చాకనే అభ్యర్థి ప్రకటన చేయాలని చూస్తున్నారు. అభ్యర్థి ఖారారులో ఆలస్యం కావడంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల ప్రచారం చేయలేక పోతున్నారు. బీజేపీ మాత్రం రఘునందన్‌రావును ముందే అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన ఇప్పటికే పార్టీ శ్రేణుల్ని కలిస్తున్నారు. పార్టీలో టికెట్ ఆశించిన ఆశావహుల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

53 రోజుల గడువు..

ఎన్నికల షెడ్యూల్ జారీ అయినప్పటి నుంచి పోలింగ్ నాటి వరకు సుదీర్ఘ సమయం ఉండడంతో రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలవ్వలేదు. పోలింగ్ సమయానికి 53 రోజుల గడువుంది. అందుకే మెదక్ ఎంపీ అభ్యర్థుల ప్రకటన విషయంలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తుంది. 53 రోజుల పాటు అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఉండాలి. ఇంత సవ ుయం ఉండడంతో ఎన్నికల వ్యయం పెరిగే అవకా శముం ది. నామినేషన్ల ప్రక్రియ షురూ కాగానే సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ప్రచారాలు సాగనున్నాయి. ఏప్రిల్ 18న నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మధ్య 25 రోజుల గడు వు ఉండడంతో ఎన్నికల్లో ధన ప్రవాహం తప్పదంటున్నారు. అందుకే ఎంపీ అభ్యర్థుల ఎంపికలో ఆర్థిక వనరుల్ని కూడా పరిశీలించే శత కోటీశ్వర్లనే పోటీకి దించుతున్నారంటున్నారు.

ఆసాని కుంటను కబ్జా నుంచి పరిరక్షించాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ఆసానికుంటను కబ్జాకోరుల నుంచి పరిరక్షించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నేత పుల్లగూర్ల లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం జిన్నారం తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయం, నీటి పారుదల శాఖ ఈఈ కార్యాలయంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బొల్లారంలోని ఆసానికుంట సర్వే నెంబర్ 296/7/1,296/7/2లలో ఓ వ్యక్తి కబ్జాకి పాల్పడి షెడ్లు కూడా నిర్మించాడన్నారు. అంతేకాకుండా వాటిని ఓ పరిశ్రమకు లీజుకు ఇచ్చారన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ అనుమతులు లేకుండా ఈ నిర్మాణాలు జరిగాయన్నారు. కబ్జా చేసిన స్థలాన్ని గతంలో జిన్నారం తహశీల్దార్ కూల్చివేశారని.. అయితే సదరు వ్యక్తి తన పలుకుబడితో మళ్లీ కబ్జాలకు పాల్పడి షెడ్లు నిర్మించాడని ఆరోపించారు. కబ్జా స్థలంలో ఏకంగా పరిశ్రమ నడుస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పన్నులు ఎందుకు వసూలు చేయలేదని ప్రశ్నించారు. అధికారులు సైతం ఆయనకు సహకరించారని ఆరోపించారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తికి సహకారం అందించిన అధికా రులపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కబ్జాలకు పాల్పడిన వ్యక్తిపై కూడా కఠిన చర్యలు తీసుకుని ఆసానికుంటను పరిరక్షించాలని కోరారు.

పల్లె తనపు ఆనవాలు.. చెన్నరాజు కవిత్వం

- మాండలికానికి పట్టాభిషేకం
- మానవ సంబంధాలకు అధిక ప్రాధాన్యం
- కవిత్వంలో రాణిస్తున్న యువకుడు
- నేడు ప్రపంచ కవిత్వ దినోత్సవం



నవతెలంగాణ-దౌల్తాబాద్


రోటి కాడి రోకలి లయ బద్ధ సంగీతాన్ని విన్నట్టు ఉం టుంది. చెట్టుమీద ఊర పిచ్చుకలు సందడి చేసినట్టు ఉంట ంది. శేను శేలుకల లేగదూడలు గంతులేసినట్టు ఉంటుంది. చిన్న చిన్న పదాలు జీవం పోసుకుని గంతులేసినట్టు ఉంటుంది. మొత్తంగా పల్లె తలపోస్తూ ఉన్నట్లు, వలపోస్తున్నట్లు ఆర్ధ్రత, ఆవేదన, దుఖం, సంతోషం సందర్భం ఏదైనా పల్లె తనకు ఆనవాలు పచ్చిపచ్చిగా కనిపిస్తుంటాయి. ఆయన పదాలు పల్లె మాండలికానికి పట్టాభిషేకం చూసి నట్టే ఉంటాయి. పల్లె మనుషులు అనుబంధాలను ఆత్మీయ తను, ఆధుని కత దాడిలో పతనమవుతున్న పల్లె జీవన స్థితిగతులను అక్షరాల్లో నిక్షిప్తం చేస్తాడు. మనల్ని మనమే తడుముకున్నట్టు, మన బాధను మనమే వలపోసుకున్నట్లు ఆయన కవిత్వం చదివితే తాదాత్మ్యం చెందుతాం. అక్షరాల ప్రేమికు డు యువకవి చెన్న రాజు. ప్రపంచ కవిత్వ దినం ఉత్సవం సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేకత కథనం.

మండల పరిధిలోని శౌరీపూర్ గ్రామానికి చెందిన చెన్న రాజు నిరుపేద కుటుంబం నుండి ఎదిగి వచ్చిన విద్యాక ుసుమం. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ పిజి చేశాడు. అనంతరం కాకతీయ యూనివర్సిటీలో తెలుగు సాహిత్యంలో పట్టా పొందిన చెన్న రాజు సురువు కవితా సంపుటి రచించాడు. ప్రస్తుతం మరో కవిత సంపుటి తీసుకువచ్చే ప్రయత్నాల్లో ఉన్నాడు. ప్రపం చీకరణ నేపథ్యం లో పతనమైన పల్లె సంస్కృతులను ఆయన కవిత్వంలో ఆవిష్కరించాడు. కూలిపో యిన కులవృత్తులను కాలగర్భంలో కలిసిపో తున్న మానవీయ సంబంధాలను ఆయన కవిత్వీకరించిన తీరు మనసు పొరలను కదిలిస్తుంది. సబ్బండ వర్గాల సామూహిక రోదనను ఆయన కవిత్వాలలో అక్షరీకరించారు. సాంకేతిక విప్లవం ఫలితంగా దెబ్బతిం టున్న మానవ సంబంధాల గురించి ఆలోచింప జేసే అద్భుతమైన కవితలను సంధించారు.

పల్లెల్లో ఉపయోగించే పదబంధాలు ఆయన కవితల నిండా తొణికిసలాడుతాయి. ఈతరం మరిచిపోతున్న ఎన్నో పల్లె పదాలు ఆయన కవితల నిండా దర్శనమిస్తాయి. ప్రపంచంలో జరిగే సంఘటనలకు కరిగిపోయి కవిత్వమై ప్రవహిస్తాడు. కండ్ల ముందు కనిపించే ప్రతి సందర్భాన్ని అక్షరాలలో నిక్షిప్తం చేసి కవిత్వం అల్లుతాడు. కవితలే కాదు కథల రాయడం లో కూడా చెన్న రాజు ఇప్పుడిప్పుడే అడుగులు మొదలు పెట్టాడు. ఆయన రాసిన పైలం బిడ్డలి కథ తెలంగాణ దళిత కథ 2020 సంకలనంలో ప్రచురించబడింది. అంతకు ముందు ప్రముఖ దినపత్రిక ఆదివారం అనుబంధంలో సైతం ఆ కథ అచ్చయింది. సాహిత్య రంగంలో తనకంటూ ఓ ప్రత్యేకత చాటుకుంటున్న యువకవి చెన్న రాజు ఇటీవల ప్రభుత్వ గురుకుల ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందడం విశేషం.



వాల్‌పోస్టర్ల తొలగింపు



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ మండలంలో వాల్‌పోస్టర్ల తొలగించకపోవడంపై బుధవారం నవతెలంగాణ పత్రికలో ప్రచురితమైన వార్తకు అధిరులు స్పందించారు. వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లు, బ్యానర్‌లను బుధవారం తొలగించారు.

పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనాలు పెంచాలి





నవతెలంగాణ-సదాశివపేట, నారాయణఖేడ్‌రూరల్

73 షెడ్యూలు ఎంప్లాయిస్మెంట్లో పెరిగిన ధరలు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ సదాశివపేట, నారాయణఖేడ్ కార్యాలయాల్లో బుధవారం ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సదాశివపేటలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ఖేడ్‌లో సీఐటీయూ జిల్లా నాయకులు బాబురావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌కు 1948 వేతనాల చట్టం ఆధారంగా కనీస వేతనాలు నిర్ణయిస్తూ 2024 జనవరి 29 ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ నోటిఫికేషన్ జీ.ఓలు చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెరిగిన ధరలకు ఆధారంగా పెంచలేదని, ఇప్పుడున్న ధరల ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 30వ తేదీ వరకు కార్మికుల దగ్గరకు వెళ్లి కనీస వేతనాలు పెంచాలని క్యాంపియన్ నిర్వహిస్తున్నామని.. ఈ మేరకు ఆ క్యాంపియన్ కరపత్రాన్ని బుధవారం సీఐటీయూ ఆఫీసులో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2024 మార్చి 31లోపు అభ్యంతరాలు సూచనలు తెలియజేయాలని కార్మిక సంఘాలకు జీవోలు పంపార న్నారు. అయితే ఈ జో.ఓ ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచలేద న్నారు. ఈ నిర్ణయం కార్మికుల కడుపు కొట్టి యజమానులు బొజ్జలు నింపేదిగా ఉన్నదన్నారు. కార్మికుల కనీస అవసరాలు కూడా పరిగణ లోకి తీసుకోలేదని.. కార్మిక సంఘాల డిమాండ్‌ను కూడా పక్కకు పెట్టిదన్నారు. గతంలో ఉన్న కనీస వేతనాల సలహా మండలి సూచనలు కూడా కనీసం పట్టించుకో లేదన్నారు. దాంతో ఈనెల 30 వరకు లేబర్ డిపార్ట్మెంట్లలో సవరణలు కోరుతూ లెటర్స్ పెడుతున్నామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెరిగిన ధరలకు ఆధారంగా శాస్త్రీయబద్ధంగా కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఉండే విధంగా జీవోలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమాల్లో సదాశివపేటలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, మల్లేశం, శ్రీనివాస్, రవికుమార్, మైబల్లి, ఖేడ్‌లో సీఐటీయూ నాయకులు సతీష్, రాజు, కుమార్, చంద్రకళ, శకుంతల, రవి పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ భూ బాధితుల ధర్నా

- ఆర్డీవోకు వ్యతిరేకంగా నినాదాలు
- రూ. 7 లక్షల 50 వేలకు గుంట భూమి రాదని రైతుల ఆవేదన
- న్యాయం చేయాలని 7 గ్రామాల రైతుల వేడుకోలు



నవతెలంగాణ-గజ్వేల్

రీజనల్ రింగ్ రోడ్‌లో భూములు పోతున్నాయని గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రైతులు రోడ్డు కెక్కారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు బైటాయించారు. గత ప్రభుత్వం 18 లక్షలు ఎకరాకు కేటాయించగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు లక్షలా 50 వేలు ఇస్తావని చెప్పడం ఎంతవరకు సమంజసం అని రైతులు మండపడ్డారు. 2013 చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. చర్చ కోసం రైతులను రమ్మని చెప్పి..ఆర్డిఓ అందుబాటులో లేకపోవడంతో ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గజ్వేల్ ఐఓసీ గేటు మూసివేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ఆర్‌ఆర్‌ఆర్ భూ బాధిత రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం 18 లక్షలు ఇస్తామని చెప్పారని, ప్రస్తుత ప్రభుత్వం 7 లక్షల 50 వేలు ఇస్తానంటే ఒప్పుకోలేదన్నారు. అదే క్రమంలో గజ్వేల్ ఆర్ డి ఓ కార్యాలయానికి రమ్మనడంతో ఆర్డీవో లేకపోవడంతో గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక గేటు మూసివేసి ధర్నా నిర్వహించామని తెలిపారు. మర్కుక్ మండలం ఇప్పలగూడెం, నరసన్నపేట, చేబర్తి, పాతూర్ గ్రామాలలో 138 ఎకరాల 4 గుంటల భూమి ఉందని, ఎకరానికి కోటిన్నర విలువ చేసే భూమికి ప్రభుత్వం రూ. 7 లక్షల 50 వేలు పరిహారం ఇస్తే బయట గుంట భూమి రాదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఐఓసి కార్యాలయం ధర్నా దగ్గరకు చేరుకొని రైతులతో చర్చించి..ఆందోళనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌రెడ్డి, శివారెడ్డి, సాయికుమార్, బాల నరసయ్య, రవీందర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, చాట్లపల్లి నరసయ్య, చాట్లపల్లి, దేవదాసు, కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికలు

- సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా
- బార్డర్ చెక్‌పోస్టులు.. విస్తృత తనిఖీలు
- మల్టీజోన్-2 ఐజీ సుధీర్‌బాబు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్‌లు విధులు నిర్వహించేందుకు సంసిద్ధం అవ్వాలని మల్టీ జోన్-2 ఐజీ సుధీర్‌బాబు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇంటర్ స్టేట్, ఇంటర్ డిస్టిక్ ఎస్పీలతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా ఇతర రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతంగా ఉండడం వల్ల ఎన్నికల్లో ఏటాంటి ఇబ్బందులు తలెత్తకుండా బోర్డర్ జిల్లాల ఎస్పీలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడం, పోలీస్ నిఘా ఎక్కువగా ఉండడంతో క్రిమినల్స్ బార్డర్‌లో ఉంటున్నారని పేర్కొన్నారు. వారిని కట్టడి చేయడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. జిల్లా పరిధిలో ఎక్కువ కోసం బోర్డర్ చెక్‌పోస్టులు, ఇంటర్ డిస్టిక్, ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బార్డర్ల వద్ద క్రిమినల్స్ తల దాచుకోవడం వల్ల సరిహద్దుల్లో పోలీసులకు ఉన్న సమస్యలు తెల్సుకొని వాటిని అధిగమించేందుక చర్యలు తీసుకుంటామన్నారు. దాని వల్ల ఎంత మంది సిబ్బందిని ఎన్నికల విధుల్లోకి తీసుకోవాలనేది నిర్ధారణ చేస్తామని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో శాంతిభద్రతల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా సమర్ధవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల వేళ పోలీస్ విభాగంలో కింది నుంచి పైస్థాయి వరకు అందరూ అప్రమత్తంగా పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి నామినేషన్లు, ప్రచారాలు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు కూడా పోలీసులు సమర్ధవంతంగా పనిచేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ఎన్నికల కోసం నగదు, బంగారం, ఇతర వస్తువుల రవాణాపై గట్టి నిఘా పెట్టి అరికట్టాల్సిన అవసరముందన్నారు. నేరస్తుల్ని ముందస్తుగా బైండోవర్స్ చేయడం, క్రిమినల్స్ కదలికల్ని పసిగట్టి ఎన్నికలకు విఘాతం కల్గకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహాలకు ముసుగు వేయడం సరికాదు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

పార్లమెంట్ ఎన్నికల కోడ్ పేరుతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ముసుగు వేయడం దారుణమని.. వాటిని వెంటనే తొలగించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ఉపాధ్యక్షులు జంబల్ సంతోష్ డిమాండ్ చేశారు. ఖేడ్‌లో బుధవారం జరిగిన కేవీపీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజకీయాలకతీతం అని.. అలాంటిది ఆయన విగ్రహాలకు ముసుగు ఎలా వేస్తారని ప్రశ్నించారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకుల విగ్రహాలకు మాత్రమే ముసుగులు వేయడంతోపాటు.. అంబేద్కర్, పూలే, స్వామి వివేకానంద భగత్‌సింగ్ వంటి మహనీ యుల విగ్రహాలకు కూడా ముసుగులు వేయడం దారుణమన్నారు. వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ నెలను పూలే అంబేద్కర్ జయంతుల మాసంగా పెద్దఎత్తున ప్రజలు నిర్వహిస్తారని.. కాబట్టి ఆ మహనీయుల విగ్రహాలకు వేసిన ముసుగులను వెంటనే తొలగించాలని కేవీపీఎస్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ కార్యకర్తలునితిన్, సుభాష్, అఖిల్, జోసెఫ్, సీమోన్, బస్వరాజు పాల్గొన్నారు.

గీతంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ (జీఎస్పీ), హైదరాబాద్ బుధవారం 'ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని' నిర్వహించారు. 'పరిశుభ్రమైన నోరే.. ఆరోగ్యకరమైన దేహం' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమంలో రూట్ కెనాల్, ఫేషియల్ ట్రామా కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ రాము నోముల ముఖ్య అతిథిగా హాజరై సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నోటి పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. నోటి ఆరోగ్యం, దెహిక ఆరోగ్య సమస్యల మధ్య సంబంధాన్ని డాక్టర్ రాము ప్రస్తావిస్తూ, నోటి నుంచి బ్యాక్టీరియా రక్తప్రవాహంలోకి ప్రవేశించి శరీరంలోని ఇతర భాగాలపై ప్రభావం చూపుతుందన్నారు. పళ్ల నుధ్య ఖాళీలు, చిగుళ్ల వ్యాధి, నోటి దుర్వాసన నంటి సాధారణ దంత సమస్యలన నివారించడంలో క్రనుబద్ధంగా బ్రెష్ చేసుకోవడం, ఫ్లాసింగ్ వంటి మంచి నోటి పరిశుభ్రత పద్ధతులను వివరించారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న కాస్మెటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ కె. మౌనిక మాట్లాడుతూ.. సరైన జీర్ణక్రియ, ఆత్మగౌరవం, ఇరుగు పొరుగుతో సుల ువుగా కలవడం వంటి వాటి కోసం నోటిని ఆరోగ్యకరంగా ఉంచుకోవడం ఎంతో అవసరమన్నారు. రోజుకు రెండుసార్లు మెత్తటి బ్రెష్తో పళ్లు తోడుడం, నాలుకను ప్రతిరోజూ శుభ్రం చేయడం, చక్కెరను పరిమితంగా తీసుకోవడం, దంత వెద్యుడిని క్రమం తప్పకుండా సందర్శించడం, మరెన్నో నోటి పరిశుభ్రత పద్ధతులను ఆమె వివరించారు. గీతం స్టూడెంట్ లెఫ్ట్, గీతం ఫార్మసీ స్టూడెంట్ అసోసియేషన్ (జీపీఎస్ఏ) సహకారంతో నిర్వహించిన నోటి ఆరోగ్య అవగాహన శిబిరంలో అతిథులు ఇద్దరూ పాల్గొని, తగు సూచనలు చేశారు. తొలుత, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్ అతిథులను స్వాగతించి, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పవన్ కుమార్ చింతమనేని ఈ కార్యక్రమాలను సమన్వయం చేశారు. నోటి ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత, సాధారణ ఆరోగ్యానికి దానికి ఉన్న సంబంధం గురించిన అవగాహన, పెంపొందించడానికి ప్రతియేటా మార్చి 20న ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. నోటి పరిశుభ్రత పద్ధతులను ప్రోత్సహించడంపై దృష్టి పెడతారు.

ఘనంగా ప్రారంభమైన రేణుక ఎల్లమ్మ జాతర



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామ శివారులోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ 7వ వార్షికోత్సవం వేడుకలు సంబురంగా ప్రారంభం అయ్యాయి. వేడుకల్లో భాగంగా బుధవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ నాయకుడు కాదుల వారి లక్ష్మి నర్సింహ్మా గౌడ్ తెలిపారు. ఇందులో భాగంగా అమ్మవారికి సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్య వచనము, గోవుపూజ, సర్వదేవత అవాహిత పూజ, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, దూపదీప నైవేద్యం, మంగళ నీరాజనం, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నేడు (గురువారం) సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్య వచనము, గోవుపూజ, సర్వదేవత ఆవాహిత పూజ, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, దూపదీప నైవేద్యం, మంగళనీరాజనం, తీర్థప్రసాద వితరణ, శ్రీ రేణుక ఎల్లమ్మ సమేత జమదగ్ని స్వామి వారి కళ్యాణం, అమ్మవారికి బోనాలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. రేపు (శుక్రవారం) సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్య వచనము, గోవుపూజ, సర్వదేవత ఆవాహిత పూజ, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, దూపదీప నైవేద్యం, మంగళనీరాజనం, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలతో పాటు వివిధ పూజా కార్యక్రమాలు ఉంటాయని కాంగ్రెస్ నాయకుడు నర్సింహ్మా గౌడ్? తెలిపారు. ఈ పూజ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు,భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పోషక విలువలు పెంచేందుకు పోషణ పక్వాడ



నవతెలంగాణ-జహీరాబాద్

గర్భిణీ స్త్రీలలో పోషక విలువలను పెంపొందించేందుకు పోషణ పక్వాడ్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని డీడబ్ల్యూఓ లలిత కుమారి అన్నారు. జహీరాబాద్‌లో పోషణ పక్వాడ్ కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లలిత కుమారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పుట్టబోయే బిడ్డల్లో ఏ విధమైన పోషక లోపాలు ఉండకూడదన్న ఉద్దేశంతో గర్భం దాల్చిన నాటి నుంచే పోషణ పక్వాడ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాగే బేటి బచావో బేటి పడావో గురించి కూడా అవగా హన కల్పించారు. గర్భిణీలకు శ్రీమంతాలు, 6 నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన, అక్షర అభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సఖి సెంటర్ అధికారిని కల్పన మేడం, మెప్మా అనిత, లక్ష్మమ్మ ప్రాజెక్టు సీడీపీఓ సునీతబాయి, సూపర్వైజర్స్ అంజమ్మ అనిత కుమారి, సునీత, తులసమ్మ, నీరజ గ్రేస్, విజయలక్ష్మి, సద్గుణ రాధమ్మ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల్లో కుష్టు వ్యాధి నిర్మూలన అంశంపై అవగాహన సర్వే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు జిన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కోమల్ తారక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 వరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. జిన్నారం మండలం లోని వివిధ గ్రామాల్లో అయా గ్రామాలకు సంబంధించిన ఆశా వర్కర్లు సంబంధిత పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటి సర్వే చేపడుతున్నారన్నారు. జిన్నారం, పెద్దమ్మ గూడెం, నర్రిగూడెం గ్రామాలలో బుధవారం ఆశా వర్కర్లు నాగమణి, నజీమా ఈ కార్యక్రమాలు చేపట్టారని సర్వేలో ఓ మహిళకు కుష్టు లక్షణాలు ఉన్నట్లు గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. కుష్టు వ్యాధి నివారణ జాగ్రత్తల కోసం తగిన సూచనలు ఇతరత్రా సలహాలు కార్యక్రమంలో భాగంగా చేస్తున్నట్లు డాక్టర్ కోమల్ తారక్ తెలిపారు.



నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-న్యాల్‌కల్

రాఘవపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సంగన్న నూతన గృహప్రవేశ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొని.. సంగన్నకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సంగన్న సన్మానించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, సుధాకర్ రెడ్డి, మహ్మద్ అలీ తదితరులున్నారు.



బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి..

నవతెలంగాణ-న్యాల్‌కల్

మరింయపూర్ బసవరాజ్ పాటిల్ బీఆర్ఎస్ వీడి బీజేపీలో చేరారు. ఆయనకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి పాటిల్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా బసరాజ్ పాటిల్ మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై బీజేపీలో చేరినట్టు చెప్పారు.



కేంద్రంలో బీజేపీ అధికారం ఖాయం

నవతెలంగాణ-జోగిపేట

బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని కేంద్రంలో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు అనంతరావు కులకర్ణి అన్నారు. జోగిపేట బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్థిక అభివృద్ధిలో ప్రపంచంలోనే మన దేశాన్ని అగ్రిగామిగా నిలబెట్టడం మోడీతోనే సాధ్యమవుతుందన్నారు. మోడీ పరిపాలన ప్రజా సంక్షేమ దిశగా కొనసాగుతుందన్నారు. జహీరాబాద్ పార్లమెంటు అభ్యర్థి బీబీ పాటిల్ హ్యాట్రిక్ సాధించే దిశగా ప్రతి కార్యకర్త నాయకులు మోడీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామ గ్రామాన బీజేపీని బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రభాకర్ గౌడ్, జగన్నాథం, ప్రభాత్ కుమార్, రమేష్ బస్వరాజ్, బసవరాజ్ పటేల్, అరవింద్ రెడ్డి, రామకృష్ణ, బ్రహ్మం, శివశంకర్, సుమన్, శివచందర్, రాజశేఖర్ రెడ్డి, నరసింహులు, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ఎకరాకు రూ.10 వేల సాయం అందించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సభ్యులు అతిమేల మాణిక్



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

అకాల భారీ వర్షాలతో నారాయణఖేడ్ నియోజకవర్గంలో కంగ్టి, తడ్కల్, కల్హేర్ మండలాల్లో మొక్కజొన్న, వేరుశనగ, ఇతర చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయని, పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సభ్యులు అతిమేల మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటల నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం కింద ఎకరాకు పదివేల రూపాయలు ఇవ్వాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పత్రిక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. అకాల వర్షం, ఈదురు గాలులతో చేతికొచ్చిన పంట నేలవాలిందన్నారు. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కాబట్టి ప్రభుత్వం రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలన్నారు.



గృహప్రవేశానికి హాజరైన మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మునిసిపల్ పరిధిలోని 2వ వార్డు బీసీ కాలనీలో నర్సింగరావు నూతన ఇంటి గృహప్రవేశానికి మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డిలు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. నర్సింగ్‌రావు దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బీరప్ప యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని గారకుర్తి గ్రామంలో అంబేద్కర్ నూతన కార్యవర్గాన్ని మండల అధ్యక్షుడు మోహన్ బాబు ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షులుగా గౌడుచర్ల చిన్న సాయిలు, ఉపాధ్యక్షులుగా గౌడ్ చంద్ర ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా అభిలాష్, కార్యదర్శిగా జ్యోతి రాజ్, అధికారిగా అరవింద్ సోషల్ మీడియా దివాకర్, ఆర్గనైజర్ సెక్రెటరీగా శ్రీకాంత్, అధికార ప్రతినిధిగా జైపాల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ మండల ఆల్ ఇండియా సంఘం ఉపాధ్యక్షులుఎం.నవీన్పాల్గొనడం జరిగింది.

త్యాగాలకు ప్రతీక రంజాన్



నవతెలంగాణ-జహీరాబాద్

రంజాన్ త్యాగాలకు, భక్తికి పరమార్థం, పవిత్రతకు ప్రతీక, సేవభావానికి, మతసామరస్యానికి చక్కటి నిర్వచనం.. ఇలా చెప్పుకుంటే పోతే రంజాన్ మాసం గొప్పతనం భాషకు అందనిది, భావానికి చిక్కనిది. సంవత్సరమంత తన కోసం, తన స్వార్థంకోసం పనిచేసే మనిషిని సేవభావం వైపు మరల్చే పవిత్ర మాసం రంజాన్.. నీవు బతుకూ... నీతోటి వాళ్లను బతకనివ్వు... అన్న ఖురాన్ సారాన్ని ఇప్పుడు ముస్లీం సోదరులు ఊపిరిగా పీల్చుకుంటున్నారు, భక్తి మార్గంలోని పారవశ్యాన్ని మనసార అస్వాదిస్తున్నారు. గత 26 రోజులుగా నుంచి అన్ని మసీద్‌లు భక్తులతో కిక్కిరి పోతున్నాయి. ఏడేళ్ల పసిబాలుడు మొదలుకుని 80 ఏళ్ల వృదుల వరకు రంజాన్ ఉపవాసదీక్షలు చేపడుతున్నారు. సంవత్సరంలోని 11 నెలలు మన కోసం.. ఒకే నెల అల్లాహ్ ఆచంణ కోసం అని సగర్వంగా చెప్పుకుంటున్నారు. రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు చేపడితే మిగతా సంవత్సరమంతా అదే సేవ భావం అలవరుస్తుందని వారి నమ్మకం. అందుకే ఎంత కఠినమైనా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మొక్కవోయిన దీక్షతో ముందుకు సాగుతున్నారు.

సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు..

రోజా అంటే ఉపవాసం అని అందరికీ తెలుసు. ఉపవాసం అంటే మచ్చి మంచినీళ్లు ముట్టకుండా గడపడమే కదా అని మాత్రమే మనకు తెలుసు. కానీ రోజా ఒక కడుపు మాడ్చడమే కాదు.. అదోక సందేశం, అదోక ఆచరణ, అదోక కఠోర పరీక్ష చెడు వినకు.. చెడు చూడకు, చెడు పలుకకు అన్నట్లు కుడా కాదు. సూర్యుడు ఉదయించకముందే సహర్‌తో ప్రారంభమయ్యేదే రోజా.. వేకువ జామునే భోజనం చేసిన తర్వాతా నోట్లో ఒక అన్నం మెతుకు మిగల్చకుండా నీటితో శుభ్ర పరుచుకుంటారు. అనంతరం నియ్యత్ దువా చదివి రోజా ఉంటున్నట్లు భగదవంతునికి సందేశం ఇస్తారు. ఇక అప్పటి నుంచి కఠోర ఉపవాస దీక్ష మొదలవుతుంది. నోటితో పాటు శరీరంలోని ప్రతి అవయ వాన్ని కట్టడి చేస్తారు. నడిచే అడుగులు సైతం బురదలో పడకుండా జాగ్రత్తలు పాటిస్తారు. మూత్ర విసర్జన సమ యంలో శరీరంపై ఒకచుక్క పడకుండా చూస్తారు. అబదా లు చెప్పడం, సంగీతం వినడం, దుర్భాషలాడడం, ఎదుటి వారి మనస్సు నొప్పించడం, టీవిలు, అశ్లీల చిత్రాలు చూడ డం రోజా నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. అలాగని రోజువారి కార్యక్రమాలను రోజా వంకతో పక్కన పెట్టడం కుడా సరికాదు. తన వృత్తి పనులు నిర్వర్తిస్తునే అల్లాహ్ ఆదీ నంలో ఉండాలి. తాము రోజాలో ఉన్నాని ఎదుటి వారికి పని చెప్పడం లాంటివి కుడా చేయకూడదు. తన పని తాను చేస్తూనే ఎదుటి వారికి సహాయపడుతూ ఉండాలి. ఇలా రోజా ధర్మాలను పాటిస్తే ఆకలి, దప్పిక అనేవి ఉండవని ముస్లీంల నమ్మకం. సుమారు 14 గంటల పాటు ఇలా గడిపిన అనంతరం రోజా వితరణ (ఇఫ్తార్)ను ఖర్జుర పండ్లతో నిర్వహిస్తారు.

ఖర్జూరాల ప్రత్యేకత..

రంజాన్ అనగానే అందరికి గుర్తోచ్చేది నోరూరించే ఖర్జూరాలు. ఇఫ్తార్ వేళ ఖర్జూరాకు ఉన్న ప్రత్యేకత వేరే ఏ ఫలానికి లేదంటే అతిశయోక్తి కాదు. ఇంత ప్రాధాన్యత ఎందుకంటే మహ్మద్ ప్రవక్త ఇస్లాం మత ప్రచారంలో రోజాలో ఉంటూనే ఎడారిలో ప్రయాణం సాగించే వారట. ఈ క్రమంలో ఇఫ్తార్ సమయం అవగానే ఎడారిలో ఎక్కువగా ఉండే ఖర్జూర పళ్లను ఇష్టంగా తినే వారని ముస్లీం మత పెద్దలు చెబుతున్నారు. ఇక అప్పటి నుంచి ఉపవాస దీక్షలు ఖర్జూరతోనే ఇఫ్తార్ కావిస్తున్నారు.

ఖురాన్ పఠనం, నమాజ్..

రంజాన్ మాసంలో అన్ని మసీదులు భక్తులతో కిక్కిరిసి పోతున్నాయి. చాలా మందికి నమాజ్ చేయడానికి స్థలం సరిపోక దినపత్రికలను పరుచుకోని మరీ నమాజ్‌లో పాల్గొంటారు. రోజుకు 5 పూటలా నమాజ్ చేయడం రోజాలో తప్పనిసరి నియమం. దీంతో పాటు ఉదయం ఫజర్‌కే నమాజ్ కాగానే ఖురాన్ పఠనంలో మునిగిపో తున్నారు. ఉపవాస దీక్షలో రంజాన్ మాసం అయ్యే వరకు ఖురాన్ పూర్తిగా చదవాలని చాలా మంది సంకల్పించు కుంటారు. ఖురాన్ పఠనంతో రోజాకు పూర్తి సార్థకత లభిస్తుందని వారి విశ్వాసం.

ఫిత్రాతో పేదోళ్లకు చేయుత..

రంజాన్ నియమాల్లో అతి ముఖ్యమైనది ఫిత్రా. ఒక వ్యక్తి ఏ అప్పులు చేయకుండా సంతోషంగా ఉంటే ఫిత్రా వర్తిస్తుంది. తన సంపాదనలోని (స్థిర, చర ఆస్తులు) 10 శాతం పేదలకు పంచడమే ఫిత్రా సారం. బంగారు నగలు అధికంగా ఉన్నవారు వాటి విలువలో 10 శాతాన్ని నిరుపేద అమ్మాయిల వివాహ శుహకార్యానికి చేయుతనివ్వాలి. ఇలా ప్రతి వ్యక్తి ఫిత్రా చేస్తే తన ఆస్తులకు ఏ రకమైన భంగం వాటిల్లదని ఖురాన్ సూక్తులు చెబుతున్నాయి. రంజాన్‌లో లభించే ఫిత్రాతో జహీరాబాద్ పట్టణంలోని చాలా మంది నిరుపేదలు పండుగ వేళ కోత్త దుస్తులు ధరిస్తున్నారు. భగవంతుని స్మరణలో ఉంటూ సేవా కార్యక్రమాలు చేయడం నిజంగా గోప్ప వరమే కదూ.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

- ధరణి పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- అధికారుల పని తీరుపై కలెక్టర్ అసహనం



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలోని ప్రభుత్వ భూములు అన్యాకాంతం కాకుండా రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవిన్యూ, నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సంగారెడ్డి, పటాన్చెరు, జిన్నారం తదితర మండలాల్లో చెరువులు, కుంటలు ప్రభుత్వ ఇతర ప్రభుత్వ భూములు అన్యాకాంతం కాకుండా ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని చెరువులు కుంటలు ఎఫ్‌టీఎల్ పరిధిని అధికారులు సర్వే చేసి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పటాన్చెరు, జిన్నారం, సంగారెడ్డి తదితర మండలాలలోని పెద్ద చెరువుల రికార్డులను వెంటనే సమర్పించాలని రెవెన్యూ ఇరిగేషన్ శాఖల అధికారులు ఆదేశించారు. అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ భూములు పరిరక్షించాలన్నారు. మైనింగ్ అనుమతులకు రెవెన్యూ అధికారులు ఎన్వోసీ తప్పనిసరి అన్నారు. అనుమతి పొందిన మేరకే మైనింగ్ జరిగేలా అధికారులు పటిష్ట నిఘా ఏర్పాటు చేయా లన్నారు. బొల్లారం ఎర్రగుంట చెరువులో ఏర్పాటుచేసిన వెంచర్ వివరాలు వెంటనే ఇవ్వాలని సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు. ధరణి పెండింగ్ సమస్యలను రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కరించాల న్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకాకుండా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చూడాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, ఇతర ప్రభుత్వ స్థలాలు గ్రామస్థాయిలో కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ అధికారుల సాయంతో నోటీసులు అందజేసి ఆక్రమణలను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. మునిసిపల్ అధికారులు నోటీసులు మాత్రమే ఇచ్చి కూర్చుంటారని చర్యలు చేపట్టారని అసహనం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ పద్మజారాణి, డీపీఓ సాయిబాబా, నీటి పారుదల శాఖ ఎస్ఈ మురళీధర్, ఆర్డీఓ వసంత కుమారి, సంబంధిత మండలాల తహసీల్దారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామాలలో విద్యార్థుల ఫీల్డ్ వర్క్

నవతెలంగాణ-జోగిపేట

సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ నుంచి వచ్చిన విద్యార్థులు డాకూరు, బ్రాహ్మణపల్లి గ్రామాలలో బుధవారం గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక చలనం మీద అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉన్నటువంటి వసతులు, వనరుల మీద, కాలమాన పట్టిక, గురించి నీటి వసతుల గురించి వారు వివిధ పటాల ద్వారా రైతులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సరిత, వ్యవసాయ అధికారి విజయరత్న వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రీనివాస్, శ్రీకర్, రైతులు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, యాదయ్య, రైతులు రావేప్ విద్యార్థులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్ గెలుపు కోసం కృషి చేయాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ గెలుపు కోసం ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని మామిడ్గి శివారులో గల ఎస్ఎస్‌వీ రెస్టారెంట్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కాగా ముందుగా ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్‌ను, ఎమ్మెల్యేను నాయకులు, కార్యకర్తలు గజమాల, పూలమాలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం న్యాల్‌కల్ మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు అనిల్ కుమార్‌తో ఎమ్మెల్యే పరిచయం చేయించారు. అటు పిమ్మట ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ గెలుపు కోసం ప్రతీ ఒక్క కార్యకర్త కష్టపడాలన్నారు. భారీ మెజార్టీతో ఆయన్ను గెలిపించుకుందామని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలా ధ్యక్షులు రవీందర్, ముఖ్య నాయకులు భాస్కర్, నరసింహారెడ్డి, రాజ్‌కుమార్, ప్రవీణ్, రవి కుమార్, సుధాకర్‌రెడ్డి, సంగమేష్, వసీం తదితరులున్నారు.

భూసారాన్ని పరిశీలించి పంటల సాగు చేయాలి



నవతెలంగాణ-జహీరాబాద్

భూ సారాన్ని పరిశీలించి వాతావరణ అనుకూల పంటలు నాటితే అధిక ఉత్పత్తి సాధ్యమవుతుందని కెవికె సీనియర్ శాస్త్రవేత్త వరప్రసాద్ అన్నారు. డీడీఎస్, కేవీకే ఆధ్వర్యంలో ఐసీఏఆర్ అటారి సహకారంతో సేంద్రీయ వ్యవసాయం పై నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో కంగ్టి మండల్ సంగారెడ్డి జిల్లాకు చెందిన పలు ఊర్లలో ఉన్న రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మట్టి నమూనా సేకరణ, మట్టి పరీక్ష, ఎరువుల తయారీ, కషాయాల తయారీ, చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను, వివిధ రకాల చిరుధాన్యాలు, నారు మడి పెంపకం, ఆధునిక పద్ధతిలో పశు పోషణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పతకాల గురించి వివరించారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా డా.సి.వరప్రసాద్ (సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్, కె.వ శిక్షణ యొక్క ముఖ్య ఉద్దేశాన్ని తెలిపి కేవీకేలో ఉపాధి కల్పించే ఇతర శిక్షణ కార్యక్రమాలను వివరించారు. డా.ఎస్.స్నేహలత ఇంచార్జి హెడ్ మాట్లాడుతూ.. సేంద్రీయ వ్యవసాయానికి ఈ రోజుల్లో గుర్తింపు వచ్చిందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి రేట్ ఉందన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అన్ని పద్దతులు పాటించి అధిక దిగుబడి సాధించాలన్నారు. రైతులు శిక్షణ కార్యక్రమంలో వారి అనుభవాలను తెలుపుతూ ఆనంద వ్యక్తం చేశారు. తమకు శిక్షణలో నేర్పించిన పద్దతులు తాము అనుసరిస్తూ.. ఊరిలో మిగతా వారితో కూడా చేపిస్తామన్నారు. పాల్గొన్న రైతులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 30 మంది రైతులు మరియు కేవీకే శాస్త్రవేత్తలు జి.శైలజ, వి.రమేష్, కైలాష్, ప్రియాంక, ఈ.స్వామి, శ్రీకాంత్, శ్రీధర్, జగన్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలి

నవతెలంగాణ-కొండాపూర్



కేజీబీవీ మరియు యుఆర్ఎస్ లలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ బేసిక్ పే ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, కార్యదర్శి బి.సాయితేజ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేజీబీవీ సదాశివపేట, కొండాపూర్, కాశీపూర్, జిన్నారం మరియు యూఆర్ఎస్ బీహెచ్ఎల్ పాఠశాలలను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఉన్న అన్ని రకాల సెలవులు వర్తింప చేయాలని, హెల్త్ కార్డులు ఇచ్చి, కేర్ టేకర్‌ను నియమించాలన్నారు. ఏడాదికొకసారి జీతంలో వార్షిక హెచ్చింపు చేయాలని, బదిలీలు నిర్వహించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నైట్ డ్యూటీ చేసిన వారికి ఉదయం ఇంటికి వెళ్లడానికి అవకాశం కల్పించాలని, రెండవ శనివారం సెలవు ప్రకటించాలని, సమ్మర్ హాలిడేస్‌లో జీతాలు ఇవ్వకుండా ఎన్రోల్మెంట్ డ్రైవ్ పేరుతో పెడుతున్న పని ఒత్తిడి తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు ఉవరాదేవి,రాజేశ్వరి, నాయకులు సాలేహబేగం కేజీబీవీఅండ్ యూఆర్ఎస్ ఎస్వోలు, సీఆర్టీలు, పీజీసిఆర్టీలు పాల్గొన్నారు.

నిధుల్లేక నిలిచిన మన ఊరు- మనబడి పనులు

బిల్లు రాకపోవడం వల్లే జాప్యం : కాంట్రాక్టర్లు



నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని పలు గ్రామాల్లో మన ఊరు-మనబడి కార్యక్రమం ద్వారా నిర్మాణం చేపడుతున్న పాఠశాల మౌలిక సదుపాయాల నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రారంభించి ఏండ్లవుతున్నా.. నిధుల్లేవనే సాకుతో నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆపేశారు. ఈ సందర్భంగా మానవ హక్కుల సంఘం నాయకులు రామచందర్ మాట్లాడుతూ.. చాలా వరకు పనులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మరోపక్క వచ్చిన నిధులు సక్రమంగా వినియోగించకుండా నాసిరకంగా నిర్మాణాలు చేపట్టారని.. దీంతో స్కూల్ బిల్డింగ్‌లకు పగుళ్లు వచ్చాయన్నారు. నాణ్యత లోపాన్ని పరిశీలించడంలో కొండాపూర్ మండల పంచాయతీ ఏఈ కృష్ణ నిర్లక్ష్యం వహించాడని.. అందువల్లే ఈ నిర్మాణాల నాసిరకంగా సాగాయని ఆరోపించారు. కాంట్రాక్టర్లు ఇసుక బదులుగా డస్ట్‌ను ఉపయోగించి ప్రభుత్వ స్కూల్ భవనాలు నిర్మించారని ఆరోపించారు. కాబట్టి పంచాయతీ ఏఈ పైన, కాంట్రాక్టర్ల పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి మన ఊరు-మనబడి లక్ష్యం వైపు వెళ్లాలని, లేకుంటే ప్రజా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. పనుల్లో జా ప్యం గురించి ప్రధానోపాధ్యాయులు, కాంట్రాక్టర్లను వివరణ కోరగా.. నిధులు లేవని, కట్టిన వాటికే బిల్లులు ఇవ్వలేదని చె బుతున్నారు. అందుకే పనుల్లో ఆలస్యం జరుగుతన్నదంటున్నారు.

'ఉపాధి' నిర్వీర్యానికి ప్రభుత్వాల కుట్ర



నవతెలంగాణ-సదాశివపేట

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీని నిర్వీర్యం చేయడం కోసం శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు ఆరోపించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సదాశివపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఆత్మకూర్, ఏటిగడ్డ సంఘం గ్రామాల్లో బుధవారం ఉపాధి హామీ పని ప్రదేశాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ.. ఉపాధి హామీ నిర్వీర్యం అంటే.. పేదల నోటికాడి కూడు లాక్కోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం.. పని చేసిన 15 రోజుల్లో కూలీ డబ్బులు ఇవ్వాలన్నారు. కానీ పని చేసి 2 నెలలైనా కూలి డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీళ్ల కచ్చితంగా ఉంచాలన్నారు. పని ప్రదేశంలో దెబ్బలు తగిలితే మట్టిని పూసుకోవాల్సి వస్తుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.800కు పెంచాలని, ఏడాదిలో 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో జియో ట్యాగింగ్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగయ్య, సుశీల, దశరథ్, లక్ష్మయ్య, నాగమణి, బాలమణి, సంజీవులు, అంజమ్మ, మల్లేశం, శివయ్య, బుచ్చమ్మ, రజాక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ సమత సంఘం నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-సంగారెడ్డి

డా.బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి పురస్కరించుకుని కరపత్రాన్ని అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. తదనంతరం బాబు జగ్జీవన్ రామ్ సమతా సంఘం సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బంగారు కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎల్.వేణుగోపాల్, సహాయ కార్యదర్శిగా పోలీస్ రాంచందర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఆనంద్‌రావు, కోశాధికారిగా అందెల మొగులయ్య, సహాయ కోశాధికారిగా తొగర్‌పల్లి సునీల్, గౌరవ అధ్యక్షులుగా దప్పు రమేష్, అధికార ప్రతినిధిగా కాశపాగ ఇమ్మయ్య, ఉపాధ్యక్షులుగా ముక్కగల్ల బిక్షపతి, నక్క సూర్యకుమార్, అలిగే రాజు, మచునురి చంద్రశేఖర్, ప్రకాశ్ కుప్పానగర్,మీడియా ప్రతినిధులుగా డి.అశోక్, రమణి అశోక్, ప్రచార కార్యదర్శులుగా సద్గురు కుమార్, కూనదొడ్డి ప్రభు,ఉల్లాస్,దామగల్ల మురహరి, పొట్టిగళ్ళ మోహన్, సలహాదారులుగా పల్పనూరి శేఖర్, న్యాయ సలహాదారులుగా మాతంగి చిరంజీవి, కార్యదర్శులుగా గంగేరి శ్రీనివాస్, దప్పు మాణిక్యం, మాసన్నగారి నాగరాజు సి.హెచ్.రమేష్, నడిమిదొడ్డి రూబెన్, జిల్లా కమిటీ సభ్యులుగా రాజీవ్, మీదిదొడ్డి అబ్రహం, సొన్నాయిల, బండారి అమృత్,ఏర్పుల విశాల్,ఎం. శ్రీకాంత్, దప్పు నవీన్ తదితరులను ఎన్నుకున్నారు. బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతోత్సవ ర్యాలీని సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 5 వ తేదీన జరుగుతుందని.. కాబట్టి జగ్జీవన్ రామ్ అభిమానులు, ఆయా పార్టీల నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బాబు జగ్జీవన్ రామ్ సమతా సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.

నేడు బుదేరా కూరగాయల మార్కెట్ వేలంపాట

నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో గల కూరగాయల మార్కెట్‌కు (2024, 25) సంబంధించి నేటి ఉదయం10:30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి బుధవారం నాడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తై బజార్ వేలం పాట స్థానిక ఎంపిడిఓ హరినందన్ రావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆసక్తి గల వారు తై బజార్ వేలం పాటలో పాల్గొనచ్చన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
3
గురువారం | 21 మార్చి 2024 | www.navatelangana.com

పార్లమెంటు ఎన్నికలపై బిఎల్‌ఓలకు అవగాహన

నవతెలంగాణ -వెల్దుర్తి



పార్లమెంటు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తహశీల్దార్ తులసి రామ్ అన్నారు. బుధవారం తహసిల్దార్ కార్యాలయంలో ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాలకు చెందిన బీఎల్ఓలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. ఇంటి వద్ద ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ నూతన నిబంధనలు తెచ్చిందన్నారు. 85 ఏళ్ల దాటిన వృద్ధులతో పాటు 40 శాతం పైబడిన వికలాంగులు ఇంటి వద్ద ఓటు వేసేందుకు వీలు కల్పించడం జరిగిందన్నారు. అందుకు ఫామ్ 12డి అందజేశారు. ఎన్నికల నిబంధన మేరకు ఓటర్ జాబితాను తీసుకొని 85 సంవత్సరాలు దాటిన 40 శాతం కలిగిన వికలాంగుల జాబితాను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంఎల్‌టి శివ శంకర్. ఎబిల్ఓ. సూపర్వైజర్స్ జయభారత్ రెడ్డి యాదగిరి గౌడ్ ప్రసాద్ హఫీజ బి ఎల్ వోలు పాల్గొన్నారు.

టీచర్‌గా మారిన కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



జిల్లా కలెక్టర్ టీచర్‌గా మారి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. బుధవారం మెదక్ మండలం ఖాజీపల్లి పంచాయతీ పరిధిలోని పాషాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ టీచర్‌గా మారి విద్యార్థులకు గణితం పాఠాలు బోధించారు. పాఠశాలలోని వసతుల గూర్చి ఉపాధ్యాయుడిని, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, తరగతి గదులను, త్రాగునీరు, మరుగు దొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మనిషి జీవితంలో చదువు ఉన్నతమైనదని, చదువు వల్ల జ్ఞానం పెంపొందుతుందన్నారు. గణితంలో సమస్యను పరిష్కరించిన విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, మెదక్ తహసిల్దార్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడే తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

- ఉత్కంఠరేపుతున్న మున్సిపల్ రాజకీయం
- ముగ్గురు రేసులో ఉన్నట్టు సమాచారం

నవతెలంగాణ-మనోహరాబాద్

తూప్రాన్ మున్సిపల్‌కు చైర్మన్ ఎన్నికకు నేటితో తెరపడనుంది. ఈ నెల 6న అవిశ్వాసంపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఓటింగ్ నిర్వహించగా చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గిన సంగతి విధితమే. అనంతరం ఎన్నికల కమీషన్‌కు పంపగా ఈ నెల 21న మున్సిపల్ చైర్మన్ ఎన్నికను చేపట్టడానికి ఎన్నికల కమీషన్ ఆదేశాలు జారీ చేసింది. దాంతో గురువారం జరిగే చైర్మన్ ఎన్నికకు నేటితో తెరపడనుంది. కాగా మున్సిపల్ చైర్మన్ రేసులో ముగ్గురు కౌన్సిలర్లు పోటీ పడుతున్నట్టు తెలుస్తుంది. దాంతో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా జరగనుంది. కాగా ఇప్పటికే అవిశ్వాసం పెట్టిన పది మందిలో ఉన్నవారే ఎవరికి వారు కౌన్సిలర్లను విహార యాత్రలకు తీసుకెళ్లి వారిని తమ వైపు తిప్పుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. తూప్రాన్ మున్సిపల్‌కు మొత్తం 16 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో ఒకటవ వార్డుకు చెందిన కౌన్సిలర్ బొంది రాఘవెందర్‌గౌడ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దాంతో చైర్మన్ వ్యవహార శైలి నచ్చకపోవడంతో పది మంది కౌన్సిలర్లు ఏకమై చైర్మన్ బొంది రాఘవెందర్‌పై పలు ఆరోపణలు చేస్తూ అవిశ్వాసానికి తెరలేపారు. దాంతో పది మంది కౌన్సిలర్లలో ఇద్దరు కాంగ్రెస్ కాగా ఒకరు బీజేపి ఉండగా ఏడుగురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. దాంతో అందరు కలిసి బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి పది మంది చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టారు. కాగా అవిశ్వాసం పెట్టడానికి మొత్తం పదకొండు మంది కౌన్సిలర్లు అవసరం ఉండడంతో మరో కౌన్సిలర్ కోసం వేచిచూశారు. దాంతో అనూహ్యంగా చైర్మన్ వర్గంలో ఉన్న కౌన్సిలర్ మామిడి వెంకటేష్ పదిమందితో కలిసి జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాణం ఇచ్చారు. అనంతరం పదకొండు మంది కౌన్సిలర్లు విహార యాత్రలకు వెళ్లారు. అనంతరం విహార యాత్రల నుంచి తిరిగి వచ్చిన తరువాత మామిడి వెంకటేష్ తిరిగి చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్ వర్గంలోకి వెళ్లిపోయారు. దాంతో ఓటింగ్‌కు సరిపడా పదకొండు మంది కౌన్సిలర్లు లేని పరిస్థితి నెలకొంది. దాంతో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు, గజ్వెల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి వెనువెంటనే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డిని ఓటింగ్‌కు మద్దతు తెలిపేలా ఒప్పించి అవిశ్వాసంను నెగ్గేవిధంగా చేశారు. దాంతో కలెక్టర్ ఈ నెల 6న అవిశ్వాసంపై ఓటింగ్‌కు ఆదేశాలు జారీ చేశారు. దాంతో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించగా పది మంది కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అవిశ్వాసానికి మద్దతు ఓటింగ్ వేయడంతో అవిశ్వాసం నెగ్గినట్టు ఆర్డీవో ప్రకటించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు పంపించడంతో ఎన్నికల కమీషన్ ఆదేశాల కోసం కమీషన్‌కు పంపగా ఈ నెల 21న చైర్మన్ ఎన్నికను నిర్వహించేందుకు కమీషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గురువారం చైర్మన్ ఎన్నికను నిర్వహించనున్నారు. చైర్మన్ ఎన్నిక సమయం దగ్గర పడుతున్న తరుణంలో పదిమంది కౌన్సిలర్లలో ముగ్గురు చైర్మన్ రేసులో ఉన్నట్టు తెలుస్తుంది. కాగా గురువారం జరిగే చైర్మన్ ఎన్నిక ఉత్కంఠతను రేపుతుంది. ఏది ఏమైనా తూప్రాన్ మున్సిపల్‌లో జరుగుతున్న రాజకీయాలకు నేటితో తెరపడనుంది.



పకడ్బందీగా ఎన్నికలు జరగాలి

- మండల అధికారులకు పలు సూచనలు
- నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూతు పరిశీలన
- జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్

నవతెలంగాణ-వెల్దుర్తి

పార్లమెంటు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ నియోజకవర్గంలో కొత్తగా మూడు పోలింగ్ బూత్‌లను, నర్సాపూర్ నియోజకవర్గంలో రెండు పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అందులో భాగంగానే మాసాపేట మండలం రామంతపూర్ తండాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్ కోసం తాండలో గల పాఠశాల భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల గదులను మరుగుదొడ్లను పరిసరాలను పరిశీలించారు. తండాలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, ఇంతకు ముందు ఎక్కడ ఓటు వేసేవారు తదితర వివరాలను అక్కడే ఉన్న నరసాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి ఉమ్మడి మండలాల ఎంపీడీవో జగదీశ్వర చారిలను అడిగి తెలుసుకున్నారు. తాండాలోనే ప్రస్తుతం పోలింగ్ బూతు ఏర్పాటు చేస్తున్నాం, అందుకు తండావాసులు 100% ఓటింగ్ అయ్యేవిధంగా చూడాలన్నారు. గతంలో ఓటు వేయడానికి మూడు నాలుగు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లేదని తాండవాసులు తెలిపారు. మా తాండాలో పోలింగ్ స్టేషన్ అవుతుందన్న సంతోషంతో తామంతా తమ ఓటు హక్కును వినియోగించు కుంటామన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఓటర్లకు విద్యుత్ సౌకర్యం టాయిలెట్స్ టెంటు తాగునీటి సౌకర్యం కల్పించాలని మండల అధికారులకు సూచించారు. రామంతపూర్ తండాలో మిషన్ భగీరథ నీళ్ల సరిగా రావడం లేదని బోర్ల వద్ద నుంచి నీటిని తీసుకొని వస్తున్నామని తాజా మాజీ సర్పంచ్ పకీర నాయక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు వెంటనే మిషన్ భగీరథ అధికారులను ఈ విషయమై పరిశీలించడానికి ఆదేశిస్తానని తెలిపారు. పాఠశాల స్థలం ఎంత ఉందని తాండవాసులను ప్రశ్నించగా 10 గుంటలు ఉందని సమాధానం ఇచ్చారు.



అంతస్థలం ఇక్కడ కనిపించడం లేదని పాఠశాల మొత్తం ఇరుకుగా ఉందని వెంటనే సర్వే చేయాలని అక్కడే ఉన్న ఆర్ఐ దన్సింగ్, సర్వేయర్ నరసింహులులను కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల నూతన భవనాలు నిర్మాణం కోసం స్థలం పరిశీలించామని కొంత స్థలం అటవి శాఖకు సంబంధించి ఉందని, ఈ విషయమై పరిశీలించి అటవీశాఖ స్థలం పాఠశాల నిర్మాణానికి ఇప్పించాలని తండావాసులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విఘ్నేశ్వర్, తహశీల్దార్ జ్ఞాన జ్యోతి, మండల వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తా

ఎమ్మెల్యే రోహిత్ రావు

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని జడ్చెరువు తాండలో వడగండ్ల వానకు వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిని నష్టపోయామని తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావును వేడుకున్నారు. గాలి దుమారంతో నేలకొరిగిన పంటలను ఎమ్మెల్యే రోహిత్ రావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డిలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులతో నివేదికలు తెప్పించి ముఖ్యమంత్రి, మంత్రులకు పరిస్థితిని వివరించిచి ఆదుకుంటామన్నారు. రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. మామిడి తోటలను పరిశీలించి నష్టపోయిన మామిడి పంట రైతులకు మనోధైర్యాన్ని కల్పించారు. నార్లాపూర్ గ్రామానికి చెందిన సాగర్ అనే వికలాంగునికి పింఛన్ రాకపోవడంతో ఎమ్మెల్యేకు మొర పెట్టుకోవడంతో వారికి పింఛన్ వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. అదేవిధంగా గత మూడు రోజుల క్రితం విద్యుత్‌ఘాతానికి బలైన బక్కోళ్ల బాలమల్లు కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబానికి విద్యుత్తు డిపార్ట్మెంట్ నుంచి ఆర్థిక సహాయం అందేలా తగు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఏఈ గణేష్‌కు ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం స్కూల్ విద్యార్థులతో కలిసి మాట్లాడి ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుప్రభాతారావు, ముత్యం రెడ్డి, దేమే యాదగిరి, రమేష్ రెడ్డి, ,మండల అధ్యక్షులు మారుతి, ఏంఎస్ఎస్ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, నసీరుద్దీన్, వెంకటాపూర్ మధుసూదన్ రెడ్డి, రావి పల్లి మహేందర్ రెడ్డి, అందే స్వామి, మహమ్మద్ మసూద్ అలీ, మోహన్ రెడ్డి, తుమ్మల రమేష్, రాగి పల్లి రవీందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఆకుల బాలయ్య, బోయిని చంద్రం, చల్మేటి నరేందర్, రాజు నాయక్, నరేష్ నాయక్, పంజా బాబు, కాకి రాజయ్య, సులేమాన్ నాతి లక్ష్మా గౌడ్, నాగరాజు, జేల్లా లక్ష్మణ్ గౌడ్ , పెద్ద పైడి రాజు రెడ్డి, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

పశుసంవర్ధక శాఖ మెదక్ జిల్లా ఇంచార్జి అధికారి డాక్టర్ వెంకటయ్య

నవతెలంగాణ-కౌడిపల్లి



మండలంలోని వేల్మకన్న, వసూరం తండాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు పశువైద్యదికారి రాజు పేర్కొ న్నారు. బుధవారం గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశామన్నారు. జాతీయ పశువ్యాధుల నివరణలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఇస్తున్నట్లు కౌడిపల్లి పశువైద్యాధికారి రాజు అన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇంచార్జి పశువైద్యాధికారి డాక్టర్ వెంకటయ్య ఆకస్మిక తనిఖీ చేసి వ్యాక్సిన్, రిజిస్టర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి ఒక అంటు వ్యాధి, ఇది పికార్నొ వైరస్ వలన సోకుతుందని తెలిపారు. ఈ వ్యాధి సోకడం వలన మరణాల శాతం తక్కువ అయినప్పటికీ, పశువుల్లో ఉత్పాదక శక్తి, పునరుత్పత్తి శక్తి తగ్గుతుందన్నారు. వ్యాధి లక్షణాలు అధిక జ్వరంతో నీరసించి నోరు, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి నోట్లో పొక్కులు పుండ్లు అయి ఆహారం తీసుకోకుండా నోటి నుంచి చొంగ కారుస్తూ ఉంటాయి. పాల దిగుబడి తగ్గి రైతులు నష్టపోతారన్నారు. కావున రైతులు తమ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి పశువైద్యదికారి రాజు, జెవివో కృష్ణ కుమార్,ఎల్ యెస్ ఎ వీరారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, ఓ యస్ యాదయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి

మెదక్ జిల్లా డీఈవో డాక్టర్ రాధా కిషన్

నవతెలంగాణ-హవేలి ఘనపూర్



విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధా కిషన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాజపేట్, వాడి ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధా కిషన్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల బోధన కార్యక్రమాలను పరీక్షించి సలహాలను, సూచనలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వాడి పాఠశాలలో దాతల సహాయంతో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సహాయంతో సాధ్యమైతే మధ్యాహ్న భోజనంను అక్షయపాత్ర కాకుండా పాఠశాలలోనే వంట చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ నీలకంఠం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి కేంద్రంలో పోషన్ పక్వాడా

నవతెలంగాణ-మనోహరాబాద్



గర్భిణులు కిషోర బాలబాలికలు మంచి బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని తూప్రాన్ ఏఎన్ఎం విజయకుమారి గర్భిణులకు. తల్లులకు సూచించారు. తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని అంగన్‌వాడి కేంద్రంలో అంగన్‌వాడి కేంద్రం వద్ద సూపర్ వైజర్ అంజమ్మ, టీచర్ ఇందిర ఆధ్వర్యంలో పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం మాట్లాడుతూ తల్లులు బాలబాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పోషక ఆహారాలను తీసుకోవాలని సూచించారు. జొన్నలు, రాగులు, సజ్జలులాంటి ఆరోగ్యకరమైన పోషక ఆహారాలను తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. గర్భిణులు, బాలింతలు మంచి పోషక ఆహారాలను తీసుకోవాలని శ్రద్ధను తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆరోగ్య రక్షణపై వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కేంద్రంలోని బాలింతలు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి



గర్భిణీలు బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం కోసం అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలో మంగళపర్తి గ్రామ శివారులో తాండ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్ మేఘమాల ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి హాజరై గర్భిణీ బాలింతలకు తగు సూచనలు సలహాలు చేశారు. తల్లి బిడ్డ ఆరోగ్యం కోసం తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో ఉచితంగా పాలు గుడ్డు ఆరోగ్య లక్ష్మి పథకంలో ఒక పూట పూర్తి భోజనం అందరూ వినియోగించుకోవాలని సూచించారు. రక్తహీనతను నివారించుకోవాలని చెప్పారు. ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆహారంతో పాటు చిరుధాన్యాలను కూడా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమలత మంజుల గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

ఈటెలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-మనోహరాబాద్



బీజేపి నాయకులు, హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటెల రాజెందర్‌కు మనోహరాబాద్ మండల బీజేపి రాష్ట్ర నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే స్నేహశీలి, మంచి తనానికి మారుపేరైన ఈటెల రాజెందర్ జన్మదినాన్ని పార్టీ నాయకులు ఆయన స్వగృహంలో బుదవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మనోహరాబాద్ మండలం నుంచి రాష్ట్ర నాయకులు బాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, నత్తి మల్లేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు తరలివెళ్లి ఈటెల రాజెందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, అశోక్, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఖాకీ వనంలో కలుపు మొక్కలు

- స్టేషన్ మెట్లెక్కితే చేయి తడపాల్సిందే
- ఇసుక, మట్టి దందాల్లో చేతివాటం
- రూ. 20 వేలు డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డ కానిస్టేబుల్
- పోలీసు శాఖకు మచ్చ తెస్తున్న కొందరి తీరు
- జిల్లా బాస్ దృష్టిసారించాలని కోరుతున్న ప్రజలు



నవతెలంగాణ-మెదక్

శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల ప్రాణ, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ జవాబుదారీతనంతో పారదర్శక సేవలందించే ఖాకీ వనంలో కలుపు మొక్కలు పేరుకుపోతున్నాయి. అన్యాయాలు, అక్రమాలను అరికడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన పోలీసు శాఖకు కొందరు అధికారుల తీరు మాయని మచ్చ తెస్తున్నాయి. పవిత్రమైన పోలీసు వృత్తిలో ఉంటూ ఖాకీ చొక్కా మాటున అవినీతికి పాల్పడుతూ ఆ శాఖను అప్రతిష్టపాలు చేస్తున్నారు. జిల్లాలోని మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రూ. 4వేలు లంచం తీసుకుంటూ ఓ కానిస్టేబుల్ ఏసీబీ అధికారులకు పట్టుబడడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

మెదక్ జిల్లాలో 21 మండలాలు 469 గ్రామ పంచాయతీలు, 21 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. జిల్లాలో ఎస్పీ, ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, ఒక్క ఏఆర్ డీఎస్పీ, 57 మంది సీఐలు, ఎస్ఐలు, సుమారు 800 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజారక్షణే ధ్యేయంగా రాత్రింబవళ్ళు విధులు నిర్వర్తించే పోలీసులను దేవుళ్ళుగా, స్టేషన్లను ఆలయాలుగా ప్రజలు అభివర్ణిస్తుంటారు. అంతటి ప్రాధాన్యత కలిగిన పోలీసు వ్యవస్థలో కొందరు చీడ పురుగుల తీరు కలంకాన్ని అంటగడుతుంది. గౌరవప్రదమైన వృత్తిలో ఉంటూ ప్రభుత్వ వేతనాలు తీసుకుంటూ నిసిగ్గుగా చేయి చాచడం వలన ఆ శాఖ అపకీర్తిని మూటకట్టుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న కొందరు పోలీసులు ప్రభుత్వం ఇచ్చే వేతనాల కంటే అమ్యామ్యాలు వచ్చే పనులకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అక్రమ ఇసుక, మట్టి, మద్యం దందాలు, సివిల్ తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, పేకాట వంటి కేసుల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్టేషన్ మెట్లెక్కితే చేయి తడపాల్సిందే

ప్రజలకు ఏ కష్టమొచ్చినా తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతో పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీస్తారు. కానీ ఒక్కసారి స్టేషన్ మెట్లెక్కితే చాలు అక్కడ ఉండే కొందరు అధికారుల చేయి తడపనిదే బయటకు వచ్చే పరిస్థితి ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. తమ కష్టాలు, బాధలకు పరిష్కారం చూపుతారనే నమ్మకంతో స్టేషన్‌కు వెళ్లే బాధితుల నుంచి కొందరు అధికారులు, సిబ్బంది మామూళ్లను ఆశిస్తున్నట్లు బాహటంగా చర్చించుకుంటున్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా.. చేసిన ఫిర్యాదు ఉపసంహరించుకున్నా అక్కడ ఉండే కొందరు అధికారులకు తృణమో ప్రణమో సమర్పించుకోవాల్సిందే అనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో పోలీసు జిల్లా బాస్ దృష్టిసారించి అవినీతి అధికారుల జాబితాను సిద్ధం చేసి ఖాకీ వనంలో నుంచి కలుపు మొక్కలను ఏరిపారేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఏసీబీకి చిక్కిన కానిస్టేబుల్

మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రైటర్ గా విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ బి.సురేందర్ ఇసుక అక్రమ ట్రాక్టర్ విడుదల విషయంలో ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసిబి డిఎస్పి ఆనంద్ కుమార్, సీఐలు వెంకట రాజా గౌడ్, రమేష్‌ల బృందం పట్టుకున్నారు. మెదక్ పట్టణంలోని అవుసులపల్లి శివారులో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన ఓ ట్రాక్టర్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసుల సహకారంతో రూరల్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి మైనింగ్‌కు రాశారు. మైనింగ్ శాఖ అధికారులు విధించిన జరిమానా రూ. 5 వేలను ట్రాక్టర్ యజమాని కందుల చంద్రం (రాము) డిడి రూపంలో చెల్లించాడు. వాహన రిలీజింగ్ లెటర్ తీసుకొని రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ట్రాక్టర్ యజమానికి స్టేషన్ బెయిల్ పేరిట రూ. 20 వేలు ఖర్చు అవుతుందని రైటర్ సురేందర్ డిమాండ్ చేశాడు. చేసేది లేక ఒప్పందం ప్రకారం రూ. 15 వేలను చెల్లించాడు. మిగితా రూ.5 వేల కోసం పలుమార్లు ఇబ్బంది పెట్టడంతో బాధితుడు చంద్రం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి పక్కా స్కెచ్ ప్రకారం వలపన్నారు. రూ. 5 వేలు ఇచ్చే దగ్గర బాధితుడు బతిమిలాడి రూ. 4 వేలను కానిస్టేబుల్ సురేందర్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సుమారు నాలుగు గంటల పాటు విచారణ జరిపిన అధికారులు సురేందర్‌ను అరెస్టు చేసి హైదరాబాద్ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలని ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. ఈ సంఘటనతో పోలీసు శాఖలోని అవినీతి అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

గోవుల సంరక్షణే లక్ష్యం

గోసంరక్షణకు ప్రాధాన్యత

నవతెలంగాణ-మనోహరాబాద్



మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు వెంచర్‌లో గోవుల రక్షణ కోసం అధిక ప్రాధాన్యతనిస్తూ వాటిని సంరక్షిస్తున్నారు హైదరాబాద్‌కు చెందిన అశోక్ జైన్ అనే వ్యాపారి. గోవుల రక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నారు. వాటి సంరక్షణ కోసం సకల సౌకర్యాలను కల్పిస్తున్నారు. వేసవి కాలం కావడంతో వాటికి ఎండ తీవ్రత నుంచి రక్షణ కోసం షెడ్డులను వేసి రక్షిస్తున్నారు. గతంలో ఐదు గోవులతో మొదలు పెట్టిన గోశాల ఇప్పుడు తొంబై ఆవుల వరకు ఏర్పాటు చేసి పెంచుతున్నారు. వాటిని సంరక్షించేందుకు గోశాల వద్ద కాపలదారులను కూడా ఏర్పాటు చేసి పోషణ చేపడుతున్నారు. గోవుల రక్షణే లక్ష్యమని వ్యాపారి అశోక్ జైన్ తెలుపుతున్నారు. గోవుల కోసం షెడ్డులను ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచడానికి కాపలాదారులను ఏర్పాటు చేసి ఎప్పటి కప్పుడు వాటి రక్షణచర్యలను తీసుకుంటున్నారు. గోశాల వద్ద గోవులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకుంటున్నారు. గోశాల వద్దే జైన్ మందిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అక్కడికి వచ్చే మార్వాడి, జైన్‌లతో పాటు ఇతరులు కూడా గోశాలలో ఉన్న గోవులకు పూజాదికాలు చేస్తారు. గోశాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటి రక్షణ కోసం చేపట్టే చర్యలపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పావురాల కోసం కూడా ప్రత్యేకంగా ఒక గుహలాంటి స్థంబాన్ని కూడా ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపడుతున్నారు.

ప్రభుత్వ భూములను పరిశీలన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట : పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని ప్రభుత్వ భూములను బుధవారం మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద శంకరంపేట తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడి పలు వివరాలు సేకరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన 8 మందికి నోటీసులు అందజేసినట్లు తహశీల్దార్ గ్రేసీ బాయ్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శరనప్ప, సర్వేయర్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The general public are hereby informed that **Sri Thuppathi Kumar S/o Chinna Komuraiah** has approached M/s Shriram Finance Ltd, Basheerbagh Branch Hyderabad for depositing her title deeds under Sale Deed vide Doc. No. 1092 of 2024 Dt; 12-02-2024 by way of equitable mortgage in respect of schedule property for securing her future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (7) Seven days from today, failing which the loan amount will be sanctioned to Sri Thuppathi Kumar S/o Chinna Komuraiah and no claim or ?? objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY

All that part and parcel of Open Place, admeasuring 120.00 Sq.yds equiv alent to 168.613 Sq.mtrs in Sy No.430/2A/2/1 Situated at Mubaraspur (Village), Doultabad (Mandal), Siddipet District and bounded by.
North :Open Place of Thippathi Lakshmi (North side)
South : Open Place of Bandaru Surender
East: 18'ft Wide Road
West: Open Place of Pulla Beeraiah

For Nomos Vistas, The Lawyers, Govardhan Venu, Advocate
C-701Skyline & Sterling Residency, Basheerbagh, Hyderabad 29.
Mob:-9849091266

PUBLIC NOTICE

The general public are hereby informed that **Smt Arunaji Rajyalakshmi, W/o Arunaji Praveen Kumar Chary** has approached M/s Shriram Finance Ltd Basheerbagh Branch, Hyderabad for depositing her title deeds vide Sale deed Doc. No. 12158 of 2023 Dt: 19-12-2023 by way of equitable mortgage in respect of schedule property for securing her future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (7) Seven days from today, failing which the loan amount will be sanctioned to Smt Arunaji Rajyalakshmi, W/o Arunaji Praveen Kumar Chary and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY

All that part and parcel of open place of House bearing No 1-15 (Southern part) admeasuring 91.31 Sq.yds equivalent to 76.34 Sq.mtrs Situated at Prgnapur (Village), Gajwel (Mandal) Siddipet District, Telangana State, and Bounded as Follows:-
North : House of Arunagiri Bal Narsaiah, Arunaji Venkatesh Chary, Cheburthy Himavathi @ Arunaji Susheela H-No:- 1-15
South: House of Arunaji (Vadla) Kishtaiah
East : Road
West:Open Place of Kammari Lakshmi Narsaiah

For Nomos Vistas, The Lawyers, Govardhan Venu, Advocate & CEO
C-701 Skyline & Sterling Residency, Basheerbagh, Hyderabad 29.
Mob:-9849091266

PUBLIC NOTICE

It is to inform to the general public that Mr Konadoddi Shiva Ram S/o Ashaiah R/o Todellagudem, Malkapur Sangareddy District has approached my client Bank Andhra Pradesh Grameena Vikas Bank Sangareddy Branch for sanction of additional loan in respect of the residential House No 11-71/3 built over plot No 81 in Sy.No 241/A2,241/6/1/3 and 241/AA Adm: 170 Sq.yards with the plinth area of 1184 Sq.feets situated at Laxmi venture Thodellagudem, Malkapur Gram Panchayat Kondapur Mandal Sangareddy District by virtue of purchase through The Registered sale deed document No 296/2012 dated 09-01-2012.

Originally Mr Syed Jahanzeer sab was the owner and possessor of the land in Sy.No 241/B2 Adm: Ac 1-00 guntas situated at Thodellagudem, Malkapur Gram Panchayat Kondapur Mandal Medak District and he has sold the same to Mr M. Poorna Chandra Shekar Gupta and B. Dubbaiah vide The Registered sale deed document No 3344/2007 dated 05-02-2007 and they made their purchased land into plots and sold them to different persons and MR Md Naseem and P. Sanjeeva Rao have purchased the plot No 81 in Sy.No 241/A2,241/6/1/3 and 241/AA Adm: 170 Sq.yards situated at Thodellagudem, Malkapur Gram Panchayat Kondapur Mandal Medak District by virtue of purchase through The Registered sale deed document No 4756/07 dated 20-02-2007 and they inturn sold the same to the Mr Kunadoddi Shiva Ram S/o Ashaiah vide The Registered sale deed document No 296/2012 dated 09-01-2012.

That Mr Kunadoddi Shiva Ram S/o Ashaiah has constructed the residential house over the said plot by availing the permission from the Gram Panchayat Malkapur and subsequently he has mortgaged the residential house 11-71/3 built over plot No 81 in Sy.No 241/A2,241/6/1/3 and 241/AA Adm: 170 Sq.yards with the plinth area of 1184 Sq.feets situated at Laxmi venture Thodellagudem, Malkapur Gram Panchayat Kondapur Mandal Sangareddy District vide registered mortgage deed document No 1456/2019 dated 06-02-2019 and also vide extension of registered mortgage document No 8440/2021 dated 20-10-2021 and now he approached the bank for additional loan facility it was found that the original link document No 4756/2007 dated 20-02-2007 was missing in the documents when asked by the bank officials Mr Kunadoddi Shiva Ram S/o Ashaiah has informed that the same were misplaced by their vendors, Md Naseem and P.Sanjeeva Rao at their end and he tried to trace the said document but all his efforts were put in vain as such he has executed the indemnity bond in favour of the bank indemnifying the bank that if any third party claim arose he will be he held responsible and also clear the said loan.

That basing on the indemnity bond my client bank proposed to sanction the Home loan and top up loan against the mortgage of his house as such it is to inform to the general public that if any person are having claims or objections pertaining to the document No 4756/2007 dated 20-02-2007 they may approach the under signed with in a period of 10 days along with the documentary evidence failing which my client bank presumes that there are no claims and proceed with the sanction of top up loan to him and no objections what so ever will be entertained subsequently hence public are beware of the caution notice

S. Vamshidhar Reddy
Advocate
Sangareddy

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం



మర్కుక్ ఎస్ఐ చల్ల మధుకర్ రెడ్డి
నవతెలంగాణ-మర్కుక్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతం వాతావరణంలో వినియోగించుకోవాలని మర్కుక్ ఎస్ఐ చల్ల మధుకర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాములపర్తి గ్రామంలో పార్లమెంటు ఎన్నికలలో భాగంగా ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యానికి డబ్బులకు, వస్తువులకు బానిసలు కావద్దని, నచ్చిన మెచ్చిన అభ్యర్థికి నిజాయితీగా, నిర్భయంగా ఓటు వేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. ప్రచారాన్ని ఎవరైన అడ్డుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సంఘం ప్రవర్తన నియమావళి కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏదైనా ఫిర్యాదు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1950 కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ ఎంపీపీ పాండుగౌడ్, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్, హరిపంతులు, శ్యామ్ సుందర్ గుప్త, క్రాంతి కుమార్, వెంకట్ రెడ్డి, రాజేష్ గౌడ్, దుర్గా ప్రసాద్ గౌడ్, సుధాకర్ గౌడ్, , వెంకటేష్ గౌడ్ , అజయ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

మర్కుక్ లో ఈటల జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ రంగనాయక స్వామి ఆలయంలో బుధవారం మాజీ మంత్రి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను బిజెపి మర్కుక్ మండల ఇంచార్జి సింగం సత్తయ్య, బిజెపి మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డిల అధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు టి.రమేష్ గుప్త, సుర్వీ కృష్ణమూర్తి, రాజేందర్ సింగ్,సంజీవరెడ్డి, కాంత్రి, పుట్ట అంజనేయులు, కిషోర్ రెడ్డి, ప్రవీణ్, కొండల్, చంద్రం, బాలకృష్ణ ,తదితరులున్నారు.

వడగండ్ల వానతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి



సీపీఐ(ఎం) సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శి చొప్పరి రవికుమార్
నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలంలో మంగళవారం కురిసిన ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానతో నష్టపోయిన వారిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎం) సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శి చొప్పర్ రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని పలు కాలనీలో సీపీఐ(ఎం) బృందం ఆధ్వర్యంలో పర్యటనలు చేశారని ఈ సందర్భంగా నష్టం వాటిల్లిన ప్రాంతాలను పర్యవేక్షించారు. రవికుమార్ మాట్లాడుతూ....సిద్దిపేట అర్బన్ మండలంతో పాటు పట్టణంలో ఈదురుగాళ్లు వడగళ్లతో కూడిన వర్షం వల్ల అనేక ప్రాంతాల్లో కరెంటు పోల్స్, విరిగిపోయి ఇండ్లపై పడ్డాయని వాటిని పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే పలు కాలనీలలో ఇప్పటికే పాతకాలం కరెంటు స్తంభాలను తీసేసి కొత్త వాటిని వేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా 19వ వార్డులోని అంబేద్కర్ నగర్ కాలనీలో పాత స్తంభాల స్థానంలో కొత్త వాటిని వేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వడగండ్ల వానతో చేతికొచ్చిన వరి పంట పొట్ట దశలో ఉండడంతో వరి చేలు ధ్వంసమయ్యే ప్రమాదం ఉందని, వరి నాటు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి నష్టపరిహారం అంచనా వేసి ప్రభుత్వానికి రిపోర్ట్ చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని సందర్భంగా కోరారు. వడగళ్ల వానతో నష్టపోయిన వారిని ఆదుకోనేపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులుదాసరి ప్రశాంత్, సిద్దిపేట అర్బన్ కమిటీ సభ్యులు కొండం సంజు కుమార్,నాయకులు భరత్, అరుణ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలి



-సీపీఐ(ఎం)మండల కార్యదర్శి శ్రీనివాస్ విజ్ఞప్తి
నవతెలంగాణ-బెజ్జంకి

వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం)మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ బుధవారం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలకు నష్టవాటిల్లడం తీవ్ర ఆందోళనకు గురిచేసిందని వెంటనే పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని శ్రీనివాస్ కోరారు.

కేసీఆర్ దారిలోనే రేవంత్..



మెదక్ బిజెపి ఎంపీ అభ్యర్థి రఘునందన్
నవ తెలంగాణ - సిద్దిపేట

గతంలో కేసీఆర్ అబద్దాలు చెప్పి కాలం గడిపితే ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి అదే అబద్దాలు చెప్పి వాటినే అనుసరిస్తున్నాడని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. పట్టణంలోని స్థానిక కొండ భూదేవి గార్డెన్ లో బీజేపీ జిల్లా నేతల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ...నాడు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ సీఎం కేసీఆర్ అవలంభించిన అప్రజాస్వామిక విధానాలను నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి అవలంభించడం దురదృష్టకరమన్నాడు. ప్రధానమంత్రి మోడీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రతి ఎంపీకి ఐదు కోట్ల నిధులు ఇస్తుంటే, రాష్ట్రంలో ఎన్నికల ఓటమి పాలైన అభ్యర్థులతో అభివృద్ధి పనులకు కొబ్బరికాయలు కొట్టించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, నాయకులు దూది శ్రీకాంత్ రెడ్డి, వంగ రాంచంద్రారెడ్డి, కొత్తపల్లి వేణుగోపాల్, బైరి శంకర్, గోనె మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

టెట్ నిర్వహణలో తెలుగు పేపర్-3 నిర్వహించాలి



తెలుగు పండిట్ దేవులపల్లి రమేష్
నవతెలంగాణ -నంగునూరు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టెట్ లోపాలను సవరించాలని డీఈడీ, బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని తెలుగు పండిట్ దేవులపల్లి రమేశ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్ పేపర్ -2 తెలుగు భాషా పండితులకు సంబంధంలేని సోషల్ సబ్జెక్టు టెట్ లో 60 మార్కులు ఉండటంవల్ల చాలా నష్ట పోతున్నారని వాపోయారు. ప్రతిసారి టెట్ విషయంలో నష్టం జరుగుతుందన్నారు. భాషా పండితుల కోసం స్పెషల్ టెట్ తెలుగు పేపర్- 3 నిర్వహించాలని డిమాండ్ చేశారు .పేపర్ 1 నుంచి 8వ తరగతి లోపు, పేపర్ -2 లో 10 వ తరగతి పరిధి లోపు ఉండేలా చూడాలని కోరారు. టెట్ లోపాలు సవరించి రాష్ట్ర ప్రభుత్వం భాషా పండితులకు న్యాయం చేయాలన్నారు.

బాధితుని, రైతుకుటుంబాలను అదుకోవాలి



నవతెలంగాణ- గజ్వేల్

వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను, చెట్టు విరిగి మృతిచెందిన మన్నె వెంకటేష్ కుటుంబాలను అదుకోవాలని బుధవారం వ్యవసాయ శాఖ ఆఫీసులో ఆత్మకమిటి గజ్వేల్ డివిజన్ మెనేజర్ మౌనికకి డిబిఎఫ్ ఆద్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి, వేణు మాట్లాడుతూ గజ్వేల్ మండల్ కొల్గూర్ గ్రామానికి చెందిన పదవతరగతి చదువుతున్న మన్నె వెంకటేష్ వడగండ్ల వాన వలన చెట్టు విరిగి నెత్తిమిదపడి మృతిచెందాడని అన్నారు. వడగండ్ల వాన వలన మొక్కజొన్న, టమాట, కూరగాయ తోటలు ధ్వంసమయ్యాయి. ఇండ్లు లేని పేదలకు, ఇండ్లు కూలడానికి సిద్దంగా వారు తలదాచుకోవడానికి తక్షణ సౌకర్యం గా కమిటి హల్ , మహిళ భవన్ రైతు వేదికలను ఇవ్వాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణసాయంగా ప్రభుత్వం ఎకరానికి రూ. 10 వేలు ఇవ్వాలని కోరారు.

విద్యుద్ఘాతానికి గురై పాడి ఆవు మృతి



నవతెలంగాణ - కొండపాక

కొండపాక మండలం బందారం గ్రామంలో మరుమాముల రామచంద్రంకు చెందిన పాడి ఆవు విద్యుద్ఘాతానికి గురై మృతి చెందింది. మేత కోసం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన ఆవు ట్రాన్స్ ఫార్మర్ గద్దె వద్ద ఉన్న విద్యుత్ వైరుకు తగలడంతో విద్యుద్ఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ. 50 వేల విలువ ఉంటుందని బాధితుడు తెలిపాడు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ ప్రతినిధులు కే శ్రీనివాస్ రెడ్డి కోరారు.

బీజేపీ సమావేశానికి తరలిన నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

గజ్వేల్‌లోని పిఎస్ ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన బిజెపి అసెంబ్లీ నాయకుల విస్తృత సమావేశానికి బిజెపి మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి అధ్వర్యంలో బుధవారం భారీగా తరలారు. పార్లమెంటు ఎన్నికలలో బిజెపి అభ్యర్థి మాదవనేని రఘునందన్ రావును భారీగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజేందర్ సింగ్, తిరుపతి రెడ్డి, సుర్వీకృష్ణ మూర్తి, క్రాంతి, కుశల్ సింగ్, పుట్ట అంజనేయులు, పాపోల్ల కొండల్, ప్రవీణ్ తదితరులున్నారు.

వడగండ్ల వాన భీభత్సం..



నేలరాలిన వరిధాన్యం..
నేలకొరిగిన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటల నష్టాన్ని పరిశీలించిన ఏఓ,కాంగ్రెస్ నాయకులు..
నవతెలంగాణ-బెజ్జంకి

బెజ్జంకి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆకాలంగా కురిసిన వడగండ్ల పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. రేగులపల్లి, పోతారం, నర్సింహుల పల్లి, బెజ్జంకి, లక్ష్మీపూర్‌గ్రామాల్లోని రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలకు అపార నష్టం వాటిల్లింది. వడగండ్ల వాన వల్ల చివరిదశలో ఉన్న వరిధాన్యం నేలరాలింది. మొక్కజొన్న పొద్దుతిరుగుడు పంటలు నేలకొరిగాయి. మండలంలోని అయా గ్రామాల్లో పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించేలా వ్యవసాయ శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని పంట నష్టం వాటిల్లిన రైతులు కోరుతున్నారు.

ఏఓ,కాంగ్రెస్ నాయకుల పరిశీలన

మండల పరిధిలోని రేగులపల్లి గ్రామంలో వడగండ్ల వానతో నష్టం వాటిల్లిన వరిపంటలను ఏఓ సంతోష్ మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. పంట నష్టంపై అంచనా నివేదిక రూపొందించి సంబంధిత జిల్లాధికారులకు అందజేస్తామని ఏఓ సంతోష్ తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశానుసారం నష్టం వాటిల్లిన పంటలను వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి తెలిపారు. నాయకులు అక్కరవేణి పోచయ్య, తిప్పారపు మల్లేశం, చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, మంకాలి ప్రవీన్, ఐలేని శ్రీనివాస్ రెడ్డి, జెల్లా ప్రభాకర్, జెల్లా తిరుపతి, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

నీరు కొనుగోలు చేసి వరిసాగు
దేవిశెట్టి అంజనేయులు, రేగులపల్లి



సుమారు 6 ఎకరా ల్లో వరిపంట సాగు చేశా ను. వరిపైరు మధ్యస్థ దశలో సాగునీరందలేదు. ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.30 వేలు చెల్లించి మరో రైతు బావి నుండి సాగునీరు కొనుగోలు చేశాను. చివరి దశలో ఉన్న వరిపైరుపై ఆకాలంగా కురిసిన వడగళ్ల వాన తీవ్ర ప్రభావం చూపింది. వరిధాన్యం నేలరాలింది. పంట చేతికచ్చే దశలో వరిపంటకు నష్టం వాటిల్లింది .ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలి.

రైల్వే లైన్ కొరకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం
నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్

సిద్దిపేట నుండి సిరిసిల్లకు రైల్వేలైన్ భూసేకరణ జిల్లాలోని చిన్నకోడూరు, నారాయణరావు పేట మండలాల్లో పెండింగ్ లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రైల్వే ప్రాజెక్టు ముఖ్య అధికారులు, రెవెన్యూ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో సిద్దిపేట వరకు రైల్వే పనులు పూర్తయ్యాయి. జిల్లాలో చిన్నకోడూరు, నారాయణ రావు పేట మండలాల్లో పెండింగ్ లో ఉన్న భూ సేకరణ గుర్చి రైల్వే అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.... చిన్నకోడూరు, నారాయణరావు పేట మండలాల్లో పెండింగ్ లో ఉన్న భూసేకరణను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలను సేకరించాలని ఆయా మండల తహసీల్దార్ లకు తెలిపారు. రైల్వేలైన్ మాత్రమే కాకుండా పెండింగ్ లో ఉన్న సర్వీస్ రోడ్ భూసేకరణ సైతం పూర్తి చేయాలని సూచించారు. భూ సేకరణను వేగంగా పూర్తి చేసి రైల్వే అధికారులకు అప్పగించాలని తెలిపారు. ఈ సమావేశం లో ఆర్డిఓ పి. సదానందం, రైల్వే ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ అమిత్ అగర్వాల్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ సంతోష్ కుమార్ మరియు ఇతర అధికారులు అయా మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

సింగరేణి నియామకాల్లో స్థానికత కల్పించాలి



నవ తెలంగాణ-మద్దూరు

సింగరేణి సంస్థ నియామకాల్లో స్థానికత కల్పించాలని బిఆర్ఎస్ దూల్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, బుధవారం దూల్మిట్ట మండల కేంద్రంలో సింగరేణిలో స్థానికత కల్పించాలని. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆదేశాల మేరకు బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంద యాదగిరి మాట్లాడుతూ..సింగరేణి సంస్థ స్థాపించినప్పటి నుండి ఉమ్మడి నాలుగు జిల్లాలు అదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, జిల్లాలకు చెందిన ప్రజలను స్థానికులుగా గుర్తించి రిజర్వేషన్ పరంగా ఉద్యోగాలు కల్పించేవారని ఆయన తెలిపారు. జిల్లాల విభజన లో భాగంగా కరీంనగర్ నుండి హుస్నాబాద్, అక్కన్నపేట, బెజ్జంకి, కోహెడ, వరంగల్, నుండి దూల్మిట్ట, మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి, మండలాలు నూతనంగా ఏర్పడి సిద్దిపేట జిల్లాలో కలవడంతో సింగరేణి ఉద్యోగాలలో ఈ ఎనిమిది మండలాలు నాన్ లోకల్ కిందికి వస్తున్నాయని ఆయన తెలిపారు. ఉద్యోగాల నియామకాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన తీసుకొని 8 మండలాల ప్రజలను స్థానికులుగా గుర్తించి సింగరేణిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని 8 మండలాల ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. లేని పక్షంలో నిరుద్యోగులను ఏకం చేసి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షురాలు చొప్పరి వరలక్ష్మి సాగర్, మాజీ జెడ్పిటిసి నాచగోని పద్మ వెంకట్ గౌడ్, మాజీ సర్పంచులు దుబ్బుడు దీపిక వేణుగోపాల్ రెడ్డి, ముక్క కనకయ్య, జాటోత్ రేణుక కాల్ రామ్, నాయకులు బర్మా రాజ మల్లయ్య, బండి చంద్రయ్య, ఫంగ ఎల్లయ్య దాసరి పురుషోత్తం, చింతల వేణు, శ్రీరాముల సత్తయ్య, పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ పౌరులందరి బాధ్యత



ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి
త్రీటౌన్ సీఐ విద్యాసాగర్
నవతెలంగాణ - కొండపాక

శాంతియుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి పౌరులు, రాజకీయ నాయకులు అందరూ పోలీసులకు సహకరించాలని సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సి.హెచ్. విద్యాసాగర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందన్నారు. అప్పటివరకు ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఎలాంటి ధర్నాలు, నిరసనలు తెలుపకూడదని అన్నారు. సెక్షన్ 144, 188 అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల అధికారులు మోనిటరింగ్ చేస్తూ ఉంటారు కాబట్టి ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

రాజకీయ పార్టీల నాయకులు సభలు సమావేశాలు నిర్వహించుకోవడానికి ముందస్తు అనుమతి తప్పనిసరి పొందాలని సిఐ విద్యాసాగర్ తెలిపారు. రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకుంటే ముందు దరఖాస్తు చేసుకున్న రాజకీయ పార్టీకి సమావేశాలకు అనుమతి ఇస్తామన్నారు. లేనియెడల సుమోటోగా కేసు నమోదు చేస్తామని అన్నారు. సెంట్రల్ ఆర్మ్ ఫోర్సు తో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా సిఐ తెలిపారు. 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గజ్వేల్, సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నందున 6 మార్గాలలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు

రాజకీయ పార్టీల నాయకులు ఎక్స్(ట్విట్టర్), వాట్సప్ తదితర సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే పోస్టులను పెట్టకూడదని సీఐ విద్యాసాగర్ సూచించారు. ప్రచారానికే సోషల్ మీడియాను పరిమితం చేసుకోవాలన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే పోస్టులను అనుమతించొద్దన్నారు. గ్రూపు అడ్మిన్లు బాధ్యత తీసుకొని అనవసర మెసేజ్లపై నిఘా పెట్టాలన్నారు. వివాదాస్పద వ్యక్తులను గ్రూపు నుండి తొలగించాలని గ్రూప్ అడ్మిన్ లకు సీఐ సూచించారు.

పెద్ద మొత్తంలో నగదు తరలించకూడదు

పెద్ద మొత్తంలో నగదు తరలిస్తూ పట్టుబడి నష్టాలపాలు కాకూడదని సాధారణ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు సిఐ విద్యాసాగర్ వెల్లడించారు. రూ. 50 వేలకు మించి తీసుకువెళ్తే విలువైన పత్రాలు ఎఫ్ఎస్‌సి, ఎస్ఎస్‌టి బృందాలకు చూపించాలన్నారు. ఆధారాలు లేని నగదును సీజ్ చేసి కలెక్టర్ ఆఫీసులో డిపాజిట్ చేస్తామన్నారు. 24 గంటల లోపు సంబంధిత విలువైన పత్రాలు చూపించి తిరిగి స్వాధీనం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని సిఐ కోరారు.

మామ అల్లుళ్ళ నటనకు అవార్డులు ఇవ్వాలి



దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు
నవతెలంగాణ -గజ్వేల్

అధికార అహంకారంతో పది సంవత్సరాలు ప్రజలను, ఆ పార్టీ నుండి ఎన్నికైన ప్రజాప్రతినిధులను పట్టించుకోని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఇప్పుడు అదే పార్టీ నాయకులు పాతవేస్తున్నారని మెదక్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని గజ్వేల్ పట్టణంలో బుధవారం నిర్వహించారు. కారులో ఎవరు కూడా ఉండటం లేదని అందరూ చేజారిపోతున్నారని ఇక కెసిఆర్ ఫామ్ హౌస్.కు పరిమితం అవుతారని అది కూడా తాళం పడుతుందని ఆయన విమర్శించారు. 10 సంవత్సరాల నటనకు మామకు పద్మభూషణ్, అల్లుడు హరీష్ రావుకు పద్మవిభూషణ్ అవార్డు ఇవ్వాలని అయన చెప్పారు. మెదక్ పార్లమెంట్ స్థానానికి కెసిఆర్ కు అభ్యర్థి దొరకడం లేదని ఆయన చెప్పారు. ఈ 50 రోజుల్లో 45 మండలాల్లో ప్రతి మండలానికి తాను వెళ్తానని బూత్ కమిటీల సమావేశం నిర్వహిస్తానని ఆయన తెలిపారు. కాంగ్రెస్ గేట్లు తెరిచిందని ఇతర పార్టీల నుండి రావాలని ముఖ్యమంత్రి కోరడం సిగ్గుచేటు అన్నారు. నల్లగొండ, ఖమ్మం ప్రజా ప్రతినిధులతో జాగ్రత్తగా ఉండాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు మోహన్ రెడ్డి, గురువారెడ్డి, సింగం సత్తయ్య, యాదవ్ గౌడ్, రామ్ రెడ్డి, ఎల్లురామిరెడ్డి, ఉప్పల మధు, వెంకటరమణ, శ్రీనివాస్, సురేష్ గౌడ్, నంద గౌడ్, పేర్ల శ్రీనివాస్, రాంప్రసాదరావు, సాయిబాబా, రాములు, అశోక్ గౌడ్, మనోహర్ యాదవ్, బండారు మహేష్, సురేష్, కిరణ్ రెడ్డి, నాగు ముదిరాజ్ వివిధ మండలానికి చెందిన పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థిగా ఎండి. జహంగీర్



నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి .జహంగీర్‌ను రాష్ట్ర కమిటీ బుధవారం ప్రకటించింది. వారి స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామం. వ్యవసాయ కూలీల కుటుంబంలో మహబూబ్‌అలీ, బీజన్‌బీలకు 1970లో జహంగీర్ జన్మించారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన జహంగీర్ విద్యార్థి దశ నుండే ఎస్ఎఫ్ఐలో చేరి, డీవైఎఫ్ఐ ఇతర ప్రజా సంఘాలతో పాటూ పార్టీ పూర్తికాలం కార్యకర్తగా పనిచేస్తున్నారు. తండ్రి మహబూబ్ అలీ వామపక్ష ఉద్యమంలో భాగంగా జొన్నల లారీని అడ్డగించి ప్రజలకు వాటిని పంచిన వ్యక్తిగా, పోలీసుల నిర్బంధాలను ఎదుర్కొన్న తన తండ్రి జహంగీర్ మనసులో తనదైన ముద్ర వేశారు. దీంతో అతను వామపక్ష భావజాలం వైపు మరలడానికి అదొక కారణంగా పేర్కొనవచ్చు. తన స్వగ్రామమైన మునిపంపుల గ్రామానికి సర్పంచ్‌గా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు.

ఉద్యమాలే ఊపిరిగా..

ఎండి.జహంగీర్ ఉద్యమాలే ఊపిరిగా ప్రజా సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారం కోసం ప్రజలను చైతన్యవంతం చేయడం, ప్రభుత్వం, అధికారులపై, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావడానికి ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం ఆయన దినచర్య. ప్రస్తుతం సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం జిల్లా వ్యాప్తంగా తన బృందంతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. గంధమల్ల రిజర్వాయర్‌ను నిర్మించాలని, ఈ ప్రాంత రైతులకు సాగునీరు ప్రజలకు తాగునీరు అందించాలని, మూసి కాలువల ప్రక్షాళన, బునాదిగాని, పిలాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాల్వల కోసం, ఎయిమ్స్‌లో వైద్య సౌకర్యాలు అందించాలని, బస్వాపురం ప్రాజెక్టు పూర్తి చేయాలని, భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలని అనేక పోరాటాలు నిర్వహించారు. పరిశ్రమల కాలుష్యంపై స్థానిక యువతకు స్థానికంగా ఉద్యోగం కల్పించాలని, భువనగిరి రైల్వే స్టేషన్‌లో రైళ్ల నిలిపివేత కోసం, రవాణా సదుపాయాలు మెరుగుపరిచే విధంగా బస్సులు ఏర్పాటు చేయాలని, రోడ్లు మౌలిక సదుపాయాలు, భువనగిరి కోట అభివృద్ధి రోడ్డు వెడల్పు నిర్వహించిన పోరాటాల్లో పాల్గొన్నారు. కార్మిక, కర్షక, సంఘటిత అసంఘటిత కార్మికుల హక్కుల కోసం పనిచేశారు. ప్రజానాట్యమండలి కళాకారుడిగా పనిచేయడంతో ఈ ప్రాంత చరిత్ర, ప్రజా సంస్కృతి కళారూపాలపై, ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థితిగతులపై అవగాహన కలిగి ఉన్న వ్యక్తి. దేవాదాయ భూముల పరిరక్షణ కోసం, అటు వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం నిర్వహించిన ఉద్యమాల్లో పాల్గొన్నారు.

ఎండి.జహంగీర్ పూర్తి వివరాలు...

పుట్టిన తేదీ: 1970 జూన్ 2న మునిపంపుల గ్రామం, రామన్నపేట మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా. తల్లిదండ్రులు:మహబూబ్‌అలీ, బీజన్ బీ, ఇద్దరు కుమారులు
వ్యవసాయ కూలీ కుటుంబం, జీవనాధారం: (చిరు హోటల్),
చదువు: పీజీ (కాకతీయ యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్) బీఏ బావాన్స్ న్యూ సైన్స్ కాలేజీ
(నారాయణగూడ 1989 - 91)
సీపీఐ(ఎం) సభ్యత్వం 1988. (35సంవత్సరాలు)
పార్టీ పూర్తి కాలం కార్యకర్త: 1992(32 సంవత్సరాలు)
మునిపంపుల గ్రామ సర్పంచ్ 1995-2000 సంవత్సరంలో)
1992లో చదువు వెలుగులో పనిచేశారు
(సాక్షరత ఉద్యమం జిల్లా కో-డైరెక్టర్ గా పనిచేశారు)
1989 నుండి 91 వరకు ఎస్ఎఫ్ఐ నగర ఉద్యమంలో పనిచేశారు
1992 చదువు వెలుగు (ప్రజానాట్యమండలి) లో పని చేశారు
1993 డీవైఎఫ్ఐ రామన్నపేట డివిజన్ కార్యదర్శిగా చేశారు
1997 సీపీఐ(ఎం) రామన్నపేట డివిజన్ కార్యదర్శిగా చేశారు
2010 సీపీఐ(ఎం) నకిరేకల్ డివిజన్ కార్యదర్శిగా చేశారు
2016 నుండి సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా చేస్తున్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి



నవతెలంగాణ-తొగుట

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కురిసిన గాలివాన మూలంగా నష్టపోయిన వెంకట్రావుపేట కు చెందిన బెజ్జనమైన కనకయ్య, జంగపల్లి నర్సిం హులుకు చెందిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట చేతికి వొచ్చే సమయంలో అకాల వర్షాల మూలంగా మొక్కజొన్న చేలు పడిపోవడంతో తీరని నష్టం జరిగిందన్నారు. మామిడి తోటలు, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంట చేతికి వొచ్చే సమయంలో పంట నష్టం మూలంగా తీరని నష్టం వాటిల్లిందన్నారు. యాసంగి పంట చివరి దశకు వొస్తున్న సమయంలో ప్రభుత్వం రైతుబంధు డబ్బులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. మండల వ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ 10 వేల నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరి శీలించిన వారిలో రైతు బంధు మాజీ అధ్యక్షుడు బండారి స్వామిగౌడ్, రైతులు తదితరులు ఉన్నారు.

పశువుల పాకకు నిప్పంటించినగుర్తు తెలియని వ్యక్తులు



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కవ్వం మహిపాల్ రెడ్డి బావి దగ్గర నిర్మించిన పశువుల పాకకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతు కవ్వం మహిపాల్ రెడ్డి ఉదయం 6 గంటలకు బావి దగ్గర నుండి పశువుల పాలు పిండుకొని ఇంటికొచ్చారు. ఒక గంట సమయం తర్వాత పశువుల పాకకు నిప్పు అంటుకుంటుందని పక్కన బావి రైతులు సమాచారం ఇచ్చారు. రైతు బావి దగ్గర వెళ్లేసరికి పశులపాకలో ఎండు పశుగ్రాసం, గడ్డి కట్టలు ఉండడంతో భారీగా మంటలు చెలరేగాయి. పశువుల పాకం , పశుగ్రాసం, డ్రిప్పు పైపులు పూర్తిగా దగ్ధమైనాయి. రైతు మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సుమారుగా 50 వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. రైతును ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

చిరుధాన్యాల ఆహారం ఆరోగ్యానికి మేలు



నవ తెలంగాణ - సిద్దిపేట

చిరుధాన్యాల ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలని ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వప్న అన్నారు. బుధవారం రంగదాం పల్లి గ్రామంలోనీ అంగన్వాడి సెంటర్ లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్వాడి ద్వారా అందించే పౌష్టిక ఆహారాన్ని పిల్లలు, బాలింతలు, గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అంగన్వాడీ టీచర్ పుష్ప, ఏఎన్ఎం సంతోషి, ఆశ వర్కర్ లక్ష్మీ, బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు , మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కుటుంబానికి ఎమ్మెల్యే సునీత రెడ్డి పరామర్శ



నవతెలంగాణ-కౌడిపల్లి

కౌడిపల్లి మండలం జాజి తాండలో సోమవారం సాయంత్రం వచ్చిన ఈదురు గాలులకు ఇంటిపైన వున్న రేకులతోపాటు ఎగిరిపోయి చిన్నారి మాలోత్ సంగీత మీద పడడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందడం జరిగింది. వారి కుటుంబాన్ని బుధవారం నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునితాలక్ష్మారెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నారి కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ పట్టణ మున్సిపల్ వైస్ చైర్మెన్ నయీం ఉద్దీన్, సీనియర్ నాయకులు దుర్గప్పగారి సత్యం గౌడ్, స్థానిక ఎంపీపీ రాజు నాయక్, ఎంపీటీసీల పురం మండల అధ్యక్షులు గుంజరి ప్రవీణ్ కుమార్ సీనియర్ నాయకులు సత్యంగౌడ్ మాజీ సర్పంచ్ రమేష్ , వైస్ ఎంపీపీ నవీన్ గుప్తా, ఎంపీటీసీ స్వప్న కిషోర్ గౌడ్ మాజీ సర్పంచ్‌లు లింగం సంజీవ్, శేఖర్ గుప్త, ఉప సర్పంచ్‌లు శివ, నరహరి సోషల్ మీడియా కో ఆర్డినేటర్ రామాంజనేయులు, సార ప్రతాప్ గౌడ్, రవి సాగర్, రాజు పాల్గొన్నారు.

వెల్డింగ్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొల్చారం

మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో ఇటీవల నూతనంగా కోనాపూర్ గ్రామానికి చెందిన బాలు ఏర్పాటు చేసిన వెల్డింగ్ షాప్‌ను బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనాపూర్ గ్రామానికి చెందిన బాలు స్వయంకృషితో వెల్డింగ్ షాప్‌ను ఏర్పాటు చేసుకొని ఉపాధి వైపు వెళ్లడం సంతోషకరమన్నారు. అలాగే యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ముందుకు పోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గౌరీ శంకర్ గుప్తా, సీనియర్ నాయకులు అరిగె రమేష్ కుమార్, రెడ్డిపల్లి సాయిబాబా గౌడ్, ముత్యం గారి సంతోష్ కుమార్, మండల యూత్ అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు, నాయకులు బండి రమేష్, సొసైటీ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, విష్ణువర్ధన్ రెడ్డి, కొమ్ముల రవీందర్ గౌడ్, దుర్గేష్ గౌడ్, శ్రీశైలం, జయరాజ్, చిట్కుల సురేష్, సోమ నర్సింలు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలపై పరిశోధన

కొరియర్ బాయ్ నుండి పుస్తకం రచయితగా
నిరంతర అధ్యయనం నుండి నిర్దిష్ట పరిశోధన వరకు
ప్రస్థానం ఆచార్యులు డాక్టర్ ఎం. శ్రద్ధానందం

నవ తెలంగాణ - సిద్దిపేట



పేదరికంలో పుట్టి... ఆర్థిక పరిస్థితుల మూలంగా రైతులు చేసుకుంటున్న ఆత్మహత్యలను చూసి స్పందించి సోషియో ఎకనామిక్ ఎనాలసిస్ ఆఫ్ ఫార్మర్ సూసైడ్ పేరుతో పిహెచ్ డీ పరిశోధన గ్రంథాన్ని రాసిన ఆచార్యులు డాక్టర్ ఎం. శ్రద్ధానందం అందరి మన్ననలు పొందుతున్నారు. పట్టుదల మనిషిని పతాక స్థాయికి తీసుకెళ్తుంది. మనిషిలో నిరంతరం రగిలే ఆలోచనే మహోన్నతుడిని చేస్తుంది. మనల్ని మనం నమ్ముకుంటే మహా విజయాలు సాధించవచ్చు అనడానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం. శ్రద్ధానందను ప్రతీకగా చెప్పొచ్చు.



ఇటీవల రాసిన పి. హెచ్ డి పరిశోధన గ్రంథం సోషియో ఎకనామిక్ ఎనాలసిస్ ఆఫ్ ఫార్మర్ సూసైడ్ పేరుతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక, సామజిక శాస్త్రాల పరిశోధన కేంద్రం (సెస్) డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ. రేవతి, సాహితీవేత్త డాక్టర్. నందిని సిద్దారెడ్డి, తన పి. హెచ్. డి గైడ్ ఉస్మానియా యూనివర్సిటీ ఎకానమిక్స్ ప్రొఫెసర్ బి. శివారెడ్డి లు సంయుక్తంగా ఆవిష్కరించారు. నిలువెత్తు నిర్దిష్ట పరిశోధన కు నిదర్శనం ఈ గ్రంధం. రైతు ఆత్మ హత్యానంతరం ఆ కుటుంబాలు ఎదుర్కొంటున్న దయనీయ స్థితిని ప్రత్యేకంగా తెలుపుతుంది. ఈ పుస్తకాన్ని ప్రముఖ హిమాలయ పబ్లిషర్ ముంబై వారు ముద్రించారు. దేశానికి వెన్నెముక అన్నదాతలే అని నమ్మి....ఎన్నో అంశాలు సమాజంలో ఉన్నప్పటికీ, సమాజానికి వెన్నముఖగా కొనియాడుతున్న రైతులు ఆత్మహత్య చేసుకోవడం అనేది గుండె లోతుల్లోంచి ఆలోచించవలసిన విషయం.

ఇలాంటి సమస్యలపై తను అరేళ్ళ పాటు పరిశోధన చేసి, అంతటి తో ఆగకుండా దానికి నూతన దత్తాంశాన్ని జోడించి, సవరించి నలుగురికి ఉపయోగపడే విదంగా ఒక ప్రామాణిక పుస్తకంగా(రిఫరెన్స్ పుస్తకంగా) మలిచి ప్రచురించడం ప్రత్యేకతగా పేర్కొనవచ్చు. ఆనాడు వ్యవసాయ సంక్షోభం పై మెదక్ జిల్లా నుండి కవులు, కళాకారుల ద్వారా జాలు వారిన పాటల్ని, కవిత్వాన్ని తన పరిశోధనలో పేర్కొనడం, అనగా అర్థశాస్త్రంలో సాహిత్యాన్ని జోడించి చెప్పడం ఒక కొత్త ఒరవడికి నాంది పలికారు.

సామాజిక అంశాలే తన రచనలు...

శ్రద్ధానందం గతంలోనూ వివిధఅంశాలపై పరిశోధనాత్మక గ్రంధాలు, వ్యాసాలు రాసారు. ఆంగ్లంలో ఆయన పరిశోధనాత్మక వ్యాసాలతో కూడిన రీసెర్చ్ కార్నర్ ను మరియు ఆసరా పెన్షన్ ల పై సంపాదకుడిగా మరో గ్రంధాన్ని కూడా వెలువరించారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో వివిధ అంశాలపై పరిశోధనాత్మక వ్యాసాలు కూడా ప్రచురితమైన్నాయి. అంతే కాకుండా రైతు



భీమా, ఆసరా పెన్షన్ ల పై కూడా పాలసీ డాక్యుమెంట్లు కూడా తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించారు. వీరి ఆధ్వర్యంలో రూపొందించబడ్డ విద్యార్థి అధ్యయన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి జిజ్ఞాసా లో గుర్తింపు తెచ్చాయి. పరిశోధనలో నిర్దిష్ట తకు, నాణ్యత కు పి. హెచ్ డి పర్యవేక్షకులు ప్రొఫెసర్ బి. శివారెడ్డి మరియు సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ. రేవతి సూచనలు తోడ్పడ్డాయి.



కుటుంబ నేపథ్యం....

వీరిది దిగువ మధ్య తరగతి కుటుంబం. పాఠశాల విద్యలోనే తండ్రిమరణం. విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే జరిగింది. ప్రాథమిక విద్య తన స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంత కుంట మండలం అనంతారంలో జరిగింది. ఇంటర్మీడియట్ సిరిసిల్ల, డిగ్రీ సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో, పి జి ఎకనామిక్స్, బి.ఎడ్ మరో పి జి. పబ్లిక్ పర్సనల్ మేనేజ్ మెంట్ (పి.పి. ఎం)మరియు పి. హెచ్. డి(ఎకనామిక్స్) ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో పూర్తి చేసారు. పూర్తి స్థాయి గ్రామీణ నేపథ్యంలో వచ్చి ఆంగ్లంలో రచనలు చేయడం గమనార్హం. డిగ్రీ , పి జి చదువుకునే రోజుల్లో కొరియర్ భాయ్ గా, పేపర్ భాయ్ గా పార్ట్ టైం పనిచేసారు. సాహిత్యంలో కూడా అనుభవం ఉంది.

ఉద్యోగ జీవితం...

2004 లో తాను చదివిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేటలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా నియామకమై, 2011వరకు ఇక్కడే పని చేశారు. తదనంతరం సంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కొండానాగుల, కామారెడ్డి, ఆర్మూర్ కళాశాలలో పనిచేసి, 2018లో తిరిగి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు (స్వయం ప్రతి పత్తి) బదిలీ పై వచ్చారు. 2023 మే లో సహాయ ఆచార్యుడుగా క్రమబద్దీకరించబడ్డారు.

వరించిన అవార్డులు...

ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారిగా, రచయిత గా పరిశోధకుడిగా, ఇటీవల తెలంగాణ ఇంట లెక్చువల్ ఫోరమ్ ద్వారా విశిష్ట సేవా రత్న అవార్డు, తమిళనాడు లోని ఈస్ట్ అను సంస్థ నుండి రీసెర్చ్ ఎక్స లెన్సీ అవార్డు, ఇంపాక్ట్ ఫౌండేషన్ నుండి మోటివేషనల్ ట్రైనర్ గా గుర్తింపు పొందారు. ప్రైజ్ మని అవార్డు ఫర్ బెస్ట్ ప్రెజెంటే షన్ రీసెర్చ్ పేపర్ ఇన్ నేషనల్ సెమినార్ కు అందుకున్నారు.

డిగ్రీ కళాశాల నా జీవితాన్ని మలుపు తిప్పింది
- డాక్టర్ శ్రద్ధానందం.

చిన్న నాటి నుండే ఎదోచేయాలానే తపన, నన్ను ఇంత వరకు తీసుకొచ్చింది. ముఖ్యంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలో చదవడం నా జీవితాన్ని మలుపులు తిప్పింది. కళాశాల పరిసరాలు ప్రేరేపించాయి. మా గురువు నందిని సిదారెడ్డి నాకు స్ఫూర్తి అనే చెప్పాలి.

ముగిసిన నాబార్డ్ వాటర్ షెడ్ పథకం

రైతులకు అప్పగించిన అధికారులు
పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య

నవతెలంగాణ జగదేవపూర్



జగదేవపూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న పీస్ స్వచ్ఛంద సంస్థ నాబార్డ్ బ్యాంకు మరియు గోద్రెజ్ స ం స్థ ల స హ కా రం తో ప్రారంభించబడిన వాటర్ షెడ్ ప్రాజెక్టులను బుధవారం గ్రామ వాటర్ షెడ్ కమిటీలకు అప్పగింతచారు. ఈసందర్భంగా పీస్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మందాపూర్ మరియు కొండాపూర్ మరియు గొల్లపల్లి మునిగడప వాటర్ షెడ్ -1 మరియు గొల్లపల్లి మునిగడప వాటర్ షెడ్ 2 ప్రాజెక్టులు 30 జూన్ 2023 లో ముగిసిందని సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య అన్నారు. ఆయా ప్రాజెక్టులను చేపట్టిన స్ట్రక్చర్స్ ను నిర్వహించుటకు మరియు నిర్వహణ పనులను సక్రమంగా నిర్వహించుటకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా నాబార్డు డి. డి. ఎం. శ్రీ సిసిల్ త్రిమూర్తి, గోద్రెజ్ సంస్థ నుండి దింపి దేవ్ పాల్గొన్నారు. పీస్ సంస్థ డైరెక్టర్ కే నిమ్మయ్య పాల్గొని ప్రాజెక్టు పూర్తి వివరాలు వివరించారు. సిసిల్ మాట్లాడుతూ రాబోయే రోజులలో నీటి సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. వర్షపు నీటిని వడిసి పట్టి భూమిలోకి ఇంకే విధంగా చేపట్టిన రాతి కట్టడాలు పామ్ పాండ్స్, పనుల బాధ్యత కమిటీ సభ్యులకి ఉంటుందని వివరించారు. దింపి దేవ్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా పీస్ సంస్థ వారి సహకారంతో వాటర్ షెడ్ కార్యక్రమాలను అమలు చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. వాటర్ షెడ్ పథకం ద్వారా జీవనోపాదులు ,చెట్ల పెంపకం,నీటి సంరక్షణ ద్వారా 7 గ్రామాలకు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ లు నర్సింహులు, స్వరూప, లక్ష్మి మరియు కమిటీ మెంబెర్స్ మరియు పీస్ సంస్థ కో ఆర్డినేటర్ మహేష్ , వినయ్ కుమార్ ,మల్లేష్ ,ముత్యం , మాక్స్ మేనేజర్స్ శోభారాణి,నాగమణి, వెంకట్ లక్ష్మి , పద్మ ,భాగ్యలక్ష్మి , మోహినోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై చర్యలు చేపట్టాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేష్

నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్



గతంలో హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో రియల్ ఎస్టేట్ ఇసుక మాఫియా నల్ల మట్టి మొరం పోయడం , వాగులో ఇసుక దందా పై చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేష్ ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆర్డిఓ రామ్మూర్తి, తాహసిల్దార్ రవీందర్ రెడ్డి బుధవారంఎల్లమ్మ వాగులో అక్రమంగా పోసిన మట్టిని పరిశీలించారు, మట్టిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

....
64

సీతా రామాంజనేయ వార్షిక బ్రహ్మోత్సవాలు

కనుల పండుగగా రథోత్సవం

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో గల సీతారామాంజనేయ ఆలయ 16వ వార్షికోత్సవంలో భాగంగా సీతా రాములు కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం శ్రీరామ పట్టాభిషేకం, పుష్ప విమాన రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మర్కుక్ ఎంపీపీ పాండుగౌడ్, ఆలయ వ్యవస్థాపకులు నాచారం ఆలయ మాజీ చైర్మెన్ హరిపంతులు,హజరైన ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆలయ వ్యవస్థాపకులు శభ్నవిశు హన్మంతరావు(హరిపంతులు) మాట్లాడుతూ సీతా రామాంజనేయ ఆలయంలో నేటి నుండి నిరంతరాయంగా అఖండ దీపం వెలుగుతుందని, భక్తులకు దీపాన్ని దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజరి దేశాయి రాజశేఖర శర్మ, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్, శ్యామ్ సుందర్ గుప్త, క్రాంతికుమార్, వెంకట్ రెడ్డి, రాజేష్ గౌడ్ ,దుర్గా ప్రసాద్ గౌడ్,సుధాకర్ గౌడ్, , వెంకటేష్ గౌడ్ , అజయ్,శ్రీనివాస్, తదితరులున్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఎంపిపి కూర మాణిక్య రెడ్డి

నవతెలంగాణ - చిన్నకోడూరు



వడగండ్ల వర్షంతో పంట నష్టానికి గురైన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని చిన్నకోడూరు ఎంపిపి కూర మాణిక్య రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ శర్మ, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సూచన మేరకు చిన్నకోడూరు, ఇబ్రహీంనగర్, చంద్లాపూర్, చౌడారం గ్రామాలలో మంగళవారం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను కాంగ్రెస్ నాయకులు గానీ, ప్రభుత్వం పక్షాన గాని ఎవరు స్పందించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఏసిఎస్ చైర్మన్ లు సదానందం, కనకరాజు, బిఆర్ఎస్ నాయకులు కొండం రవీందర్ రెడ్డి, కాముని ఉమేష్ చంద్ర, సురగోని రవీందర్, నెమలి సుభాష్ పాల్గొన్నారు.

అకాల వర్షానికి నష్టపోయిన ప్రాంతాల పరిశీలన

నవ తెలంగాణ - సిద్దిపేట



మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన ఇండ్లను, ప్రాంతాలను ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, ఎమ్మార్వో సలీమ్ , మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సులు బుధవారం పరిశీలించారు. అకాల వర్షానికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్థంబాలు, కూలిపోయిన గృహ సముదాయాలను జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. ఈదురుగాలులకు రోడ్లపై విరిగి పడిన చెట్లను రాత్రినుంచే పట్టణ కౌన్సిలర్లు, అధికారులు అప్రమత్తం చేశారు. వాహనదారులకు అంతరాయం లేకుండా చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో నిర్వాసితులందరిని ఆదుకుంటామని రాజనర్సు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, బిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండోదఫా ఫైలేరియా సీజనల్ సర్వే

నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలో మంగళవారం రాత్రి 8 గంటల నుండి 12 గంటల వరకు ఫ్రీ టాస్ మైక్రో ఫైలేరియా సీజనల్ సర్వే ఇంటింటికి తిరిగి ఫైలేరియా బ్లడ్స్ శాంపిల్స్ తీశారు. దోమల వల్ల అనేక రకాలైన వ్యాధులు సంక్రమిస్తాయని ఫైలేరియా మలేరియా డెంగ్యూ చికెన్ గునియా లాంటి వ్యాధులు సంక్రమిస్తాయని ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి. వాసుదేవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

నవతెలంగాణ -నంగునూరు

వడగండ్ల వానకు నంగునూరు మండలంలో దెబ్బ తిన్న మామిడి తోటలను జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ బుధవారం సందర్శించారు. నంగునూరు మండలంలోని దర్గపల్లి గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడుతూ దెబ్బతిన్న పంటల నమూనాను సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు వడగండ్ల వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిహెచ్ఎస్ఓ, సిద్దిపేట, మండల వ్యవసాయ అధికారిని గీత, ఏఈఓ వరుణ్ వర్మ, రైతులు శ్యామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నారాయణరెడ్డి, తదిదరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్ర స్వామి రథోత్సవం

నవతెలంగాణ -రాయపోల్

ప్రసన్న వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు గత రెండు రోజులుగా రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం అగ్ని గుండం, శ్రీ స్వామివారి రథోత్సవం గెలుపు, రుత్విక్ సన్మానం, అనంతరం అన్నదాన కార్యక్రమము , సాయంత్రము దోపుసేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో వడ్డేపల్లిలో రెండు రోజులుగా జరుగుతున్న వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. వడ్డేపల్లి, దొడ్ల పల్లి, వీరా రెడ్డి పల్లి, అప్పాయిపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చలువ పందిరి ఏర్పాటు చేయడం జరిగిందని వడ్డే పల్లి గ్రామ ఆలయ కమిటీ తెలిపారు

భాస్కర్‌కు రఘునందన్ పరామర్శ

నవతెలంగాణ- గజ్వేల్

ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని మెదక్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు గాడి పల్లి భాస్కర్‌కు సూచించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ కు ఇటీవల గుండె ఆపరేషన్ అయినందున ఆయనను బుధవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పరామర్శించారు.

పార్టీలు కాదు పేదల బతుకులు మార్చండి

డి బిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు

నవతెలంగాణ -గజ్వేల్

రాజకీయ నాయకులు పార్టీల కండువాలు మార్చుకొని రాజమేలుతున్నారని డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. బుధవారం గజ్వేల్ లో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు రాగానే పార్టీలు మారుతూ కండువాలు మారుతూ రాజకీయ లబ్ధి పొందుతున్నారని పేదల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. రాజకీయ నాయకులు అధికారం ఎక్కడుంటే అక్కడికి వెళ్లి తన కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు చేస్తున్న ప్రయత్నం పేదల బతుకులు మార్చేందుకు ఎందుకు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దు

నవతెలంగాణ-మద్దూరు

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి ప్రలోభాలకూ భయాందోళనకు గురి కాకూడదని చేర్యాల సిఐ ఎల్ శ్రీను తెలిపారు. బుధవారం దూల్మిట్ట మండలంలోని కొండాపూర్, గ్రామంలో ఎన్నికల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాబోయే ఎంపీ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రామాలలో యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు గమనించాలని ఆయన కోరారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మద్దూరు ఏఎస్ఐ జిల్లా జగదీష్, హెడ్ కానిస్టేబుల్ బండి శ్రీహరి గౌడు, పాల్గొన్నారు

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక

నవ తెలంగాణ - కొండపాక

బుధవారం నాడు లకుడారం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల , లకుడా రం, కుకునూరు పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో క్లస్టర్ కోఆర్డినేటర్ యాకూబ్ ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అధ్యక్షులుగా సమీనా బేగంను, కన్వీనర్ గా జానకి రెడ్డి, సభ్యులుగా కవిత, లావణ్య, స్వప్న లక్ష్మి లలిత లను ఎన్నుకున్నారు. లకుడారం ప్రాథమిక పాఠశాలలో అధ్యక్షులుగా రాచకొండ బాల్ లక్ష్మి నీ కన్వీనర్ గా రమేష్ నీ సభ్యులుగా కళ్యాణి, లావణ్య శ్రీలత ,భవాని, లత, మౌనిక ,దీప లను ఎన్నుకున్నారు. కుకునూరు పల్లి లో ప్రాథమిక పాఠశాల అధ్యక్షులుగా కొంతం లావణ్య, కన్వీనర్ గా శ్రీనివాస్ రెడ్డిని, సభ్యులుగా కవిత కళ్యాణి సుజాత ప్రమీల మమత శారద తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింలు , రామారావు, శ్రీనివాస్ , కవిత, వెంకటయ్య వి. ఏ. ఓ లు కవిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి మార్గాలు భవితకు సోపానాలు

నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

ఉద్యోగాల కన్నా స్వయం ఉపాధి మార్గాలు తృప్తినిస్తాయని, ఉన్నత స్థానాలకు చేరుస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయ గిరి బిక్షపతి అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని పాల శీతలీ కరణ కేంద్రాన్ని డెవలప్మెంట్ విభాగం విద్యార్థులచే క్షేత సందర్శన చేశారు. వివిధ గ్రామాల నుండి పాలు సేకరించే విధానాన్ని వాటిని పరిశీలించి కాపాడే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జీవి రాజిరెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ ఏలూరి కోవల కోఆర్డినేటర్ రేణుక అధ్యాపకులు కే రాజ్యలక్ష్మి , ఎం జోష్ట పి సుమలత వి శ్రీనివాస్, చుక్క రమేష్ నవీన్ సదానందం విద్యార్థులు పాల్గొన్నారు

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ఎన్నిక

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు నారోజు శంకరా చారి బుధవారం తెలిపారు.మహిళ సంఘాల అధ్వర్యంలో పాఠశాల బలోపేతం,నూరు శాతం పిల్లల ప్రవేశాలు చేపట్టి,మౌలిక సదుపాయాల రూపకల్పన చేయడం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ముఖ్య ఉద్దేశమని శంకరా చారి తెలిపారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలిగా నల్లాల వనిత,కన్వీనర్ గా ప్రధానోపాధ్యాయుడు బాధ్యతలు నిర్వర్తిస్తారని శంకరా చారి సూచించారు.

వధువుకు పుస్తె మెట్టెలు పంపిణీ

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండల కేంద్రానికి చెందిన కీర్తిశేషులు కనికరం భవాని- శివయ్యల కూతురు శిరీష వివాహానికి టీపీసీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి హాజరై పుస్తె మెట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ నిరుపేదలకు సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరు గ్రామ శాఖ అధ్యక్షుడు ఆసరాజు నాగరాజు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ యాదగిరి, బీసీ సెల్ మండల అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాగుల కృష్ణా, శ్రీధర్ గౌడ్, ఆవుల శ్రీనివాస్, ఉల్లి హరీష్, రాగుల యాదగిరి, అనారాజు దశరథం, సాంబయ్య, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈటెలకు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-తొగుట

మాజీమంత్రి ఈటెల రాజేందర్ కు బీజేపీ మండల నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రాజేందర్‌ను కలిసిన వారిలో బీజేపీ జిల్లా కార్యదర్శి విభీషన్ రెడ్డి, మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, మండ ల నాయకులు స్వామి రెడ్డి, నరేందర్, నర్సింలు ఉన్నారు.

నవతెలంగాణ-మనోహరాబాద్ :

బీజేపి నాయకులు, హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటెల రాజెందర్‌కు మనోహరాబాద్ మండల బీజేపి రాష్ట్ర నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే స్నేహశీలి, మంచి తనానికి మారుపేరైన ఈటెల రాజెందర్ జన్మదినాన్ని పార్టీ నాయకులు ఆయన స్వగృహంలో బుదవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మనోహరాబాద్ మండలం నుంచి రాష్ట్ర నాయకులు బాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, నత్తి మల్లేష్ ముదిరాజ్‌ల ఆద్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు తరలివెల్లి ఈటెల రాజెందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, అశోక్, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఆకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

సీఎం దృష్టికి తీసుకు పోతా.
గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి

నవతెలంగాణ -గజ్వేల్



జిల్లాలో అకాల వర్షాలు వడగండ్ల వర్షాలతో పంటలకు జరిగిన నష్టం పై రైతులు ఆందోళన చెందవద్దని వారిని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన ఇంటిలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడ్డ రైతులు తమ కళ్ళముందే పంటలు నష్టపోవటం చూసి రైతులు తట్టుకోలేరని ఆ బాధ ఒక రైతుగా తనకు తెలుసనని చెప్పారు. ఈ దశలో రైతుల ఆందోళనను తమ ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని అన్నారు. రైతులకు ఇలాంటి నష్టం జరగడం దురదృష్టకరమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని ఎట్టి పరిస్థితుల్లోనూ బాధిత రైతులకు అన్యాయం జరగబోదని అన్నారు. అకాల వర్షంతో నష్టపోయిన బాధిత రైతుల సమస్యను జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సీఎం దృష్టికి తాను స్వయంగా తీసుకెళ్తానని తగిన న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని తూముకుంట నర్సారెడ్డి హామీ ఇచ్చారు. కొందరు విపక్ష నాయకులు సోషల్ మీడియాలో తమ ప్రభుత్వంపై అర్థం లేని విమర్శలు చేస్తున్నారని రైతుల పట్ల వారికి మాత్రమే ప్రేమ ఉన్నట్లు వ్యాఖ్యలు చేయటం శోచనీయమన్నారు. అకాల వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారని నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించిన వెంటనే బాధిత రైతులకు తగిన విధంగా న్యాయం చేస్తామన్నారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-తొగుట



గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొగుట సిఐ ఎస్కె లతీఫ్ అన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని కాన్గల్ గ్రామంలో పోలీసు కళాబృందంతో ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ బి. లింగం తో కలిసి సిఐ పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను తప్పకుండా చదివించాలని, చదివిస్తే ఏదైనా ఉద్యోగం సాధించే అవకాశం ఉంటుందని సూచిం చారు. బాల్య వివాహాలు దాని యొక్క పర్యవసానాలు, చట్ట ప్రకారం బాల్యవివాహాలు నేరం అని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై, గ్రామాలలో, పట్టణాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే జాతీయ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని సూచించారు. ఓటర్లను ఎవరైనా భయభ్రాంతులకు గురిచేసినా ఓటు వేయమని డబ్బు, మద్యం, ఇతర గిఫ్ట్ పంపిణీ చేసినా వెంటనే భారత ఎన్నికల సంఘం హెల్ప్ లైన్ నెంబర్ 1950 ఫిర్యాదు చేయా లని సూచించారు. కళాబృందం సభ్యులు బాలు, రాజు, రవీందర్, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సార ధి సభ్యులు రవి, రవీందర్, ఎల్లయ్య, తిరుమల య్య, భార్గవి, రవీందర్, పాటల, నాటకం రూపంలో చైతన్య పరిచినారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ప్రేమల చంద్రారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మల్లయ్య, ప్రజా ప్రతినిధులు, పెద్ద లు, యువకులు, బాల బాలికలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బాకలో 1,99,236 మంది ఓటర్లు

నవతెలంగాణ -దుబ్బాక

దుబ్బాక నియోజకవర్గ పరిధిలో 253 పోలింగ్ స్టేషన్ లు ఉండగా 1,99,236 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. బుధవారం పురపాలిక కేంద్రంలోని సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు,నియోజకవర్గ స్థాయి అధికారులతో కలిసి ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో పురుషులు- 96,867, స్త్రీలు - 102369,ఎన్నారై ఓటర్లు -6, సర్వీస్ ఓటర్లు -58 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గ పరిధిలో 3 చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్ ,ఎంపీడీవో ఉమాదేవి, డిప్యూటీ తాసిల్దార్ సందీప్,మిరుదొడ్డి, అక్బర్ పేట్ భూంపల్లి మండల తహసీల్దారులు వీరేశం ,జయంత్, పిఆర్ ఏఈ రిజ్వాన్ ,దుబ్బాక ఎస్సై వి. గంగరాజు, పలువురు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఈపాస్ మిషన్‌లో ఎరువుల అమ్మకాలను చేపట్టాలి

నవతెలంగాణ -నంగునూరు

ఈ పాస్ మిషన్ లో ఎరువుల అమ్మకాలను, నిల్వలను రోజు వారీగా అప్డేట్ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ సూచించారు.బుధవారం నంగునూరు మండలంలోని నంగునూరు, గట్ల మల్యాల, పాలమాకుల, నర్మెట గ్రామాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ పలు ఎరువుల దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులు తప్పకుండా ఈపాస్ మిషన్ లో ఎరువుల అమ్మకాలను, నిల్వలను రోజు వారీగా అప్డేట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గీత, వ్యవసాయ విస్తరణ అధికారులు సాయి వర్మ, మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ...

కవిత్వం సమస్యను గుర్తిస్తుంది- పరిష్కారాన్నీ చూపుతుంది
పలు అంశాలను పరిశీలిస్తుంది- మరికొన్నింటిని సృశిస్తుంది
పాలకులకు-పాలితులకు- వా(సా)రధిగా నిలుస్తుంది
కన్నీళ్లు పెట్టిస్తుంది అక్షరాలతో కన్నీళ్లను తుడుస్తుంది
సమాజపు కుళ్ళు ఒళ్ళును నిటారున కడుగుతుంది
రవి గాంచని చోటును కవిని చూడమని అంటుంది
బాధలు బందీలనుంచి నుంచి బయటకు రప్పిస్తుంది
మనిషిని మనిషిగా బ్రతకమని పదేపదే గుర్తు చేస్తుంది
మనిషిని మనీషిగా ఎదగమని బోధిస్తుంది
అన్యాయం అక్రమాలపై ఒంటి కాలుపై లేస్తుంది
కవిత్వం కొన్నిమా(సా)ర్లు నిశ్శబ్ద విప్లవాన్ని తెస్తుంది
లక్ష్యాలను నిర్దేశిస్తుంది లక్షణంగా జీవించ మంటుంది
హద్దులు చెరుపుతుంది ఎల్లలు దాటుతూనే వుంటుంది
కవిత్వం నిత్యం సత్యం ఒక చలనం దానికదే కృత్యం
ప్రపంచమే నాపరివార మంటుంది పరిశమంటుంది
అందుకే మల్లెతీగ లాగా ఎగబ్రాకుతూనే వుంటుంది
మంచికై పోరాడుతూనే వుంటుంది దాని మనుగడ సాగుతూనే వుంటుంది
కవిత్వాక్షరాలు క(లి)ల కాలం విశ్వంలో అజరామం అజరామం



ఎలికట్టె అయిలయ్య
ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
నాగపురి. జిల్లా సిద్దిపేట